www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 288 | పేజీలు : 10 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శుక్రవారం 28-06-2024

MHR TV
www. mhrtv.com


పంప్ హౌస్ నుంచి వస్తున్న గోదావరి జలాలు

# సీతారామ సక్సెస్

## ట్రయల్ రన్ విజయవంతం


కాలువ ద్వారా పరుగులు తీస్తున్న గోదావరి

- రూ.17000 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయిని
- పది లక్షల ఎకరాలకు సాగు నీరు
- ఈ ఏడాది వైరా ప్రాజెక్టు వరకు నీళ్లు
- ఆగస్టు నెల వరకు కాల్వల నిర్మాణం పూర్తయ్యే అవకాశం
- పరిశీలించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి
- ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసిన మాజీ సీఎం కేసీఆర్

**ఖమ్మం, జూన్ 27, (ప్రజాస్వరం):** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లా సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు మోటార్ల ట్రయల్ రన్ సక్సెస్ అయింది. గత వారం రోజుల నుంచి సీతారామ ప్రాజెక్టు మోటార్లని రన్ చేయడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నం కొలిక్కి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో సీతారామ ప్రాజెక్ట్ మొదటి పంప్ హౌస్ వద్ద ట్రయల్ రన్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు సక్సెస్ అయిందని మంత్రి స్పష్టం చేశారు. రూ. 13 వేల కోట్ల అంచనాతో పది లక్షల ఎకరాలకి సాగునీటిని అందించేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి 2016 ఫిబ్రవరి 16న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. 2018లో తుమ్మల మిగతా 2లో..

# ఫైనల్‌కు భారత్

### టీ 20 సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్ పై ఘన విజయం

### కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును గట్టెక్కించిన రోహిత్ శర్మ

టీ 20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ లో ఇండియా ఘనవిజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా మొదలైంది. ఇంగ్లాండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా, భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. రోహిత్ శర్మ 57 రన్స్ చేసి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 172 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఇంగ్లాండ్ ను భారత బౌలర్లు మట్టికరింపించారు. 16.4 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌట్ చేశారు.




# సింగరేణిని కాపాడుకుంటాం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కయ్యారు

- ప్రైవేటీకరణకు కేంద్ర కుట్ర చేస్తుంది
- బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెడుతున్నది
- అధికారంలో ఉన్నన్ని రోజులు మా ప్రభుత్వం వేలాన్ని అడ్డుకున్నది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బొగ్గు గని కార్మిక సంఘం, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశం

2


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాల్గొన్న సింగరేణి కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ నేతలు

## ఆంధ్రప్రదేశ్ సీఎస్ పదవీకాలం పొడిగింపు

నీరభ్‌కుమార్ సర్వీసు ఆరు నెలలకు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం 5



## మెట్రో ఆదాయం డబుల్ అయింది

గత ఆర్థిక సంవత్సరం రూ.703.20 కోట్లు..

ఈ ఏడాది 1407-81 కోట్ల రాబడి 2



## చిల్లర టెన్షన్ ఉండదిక..

- ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్స్..!
- బండ్లగూడ డిపోలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు
- త్వరలో హైదరాబాద్ వ్యాప్తంగా ఇంప్లిమెంట్‌కు కసరత్తు

2

PhonePe G Pay Paytm

# ఐదో ఆర్థికశక్తిగా ఎదిగాం


'భారత్‌లో జరిగిన ఎన్నికలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, దేశ ప్రజలు వరుసగా మూడోసారి మెజారిటీ ఇచ్చి సుస్థిర ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేశారో ప్రపంచం చూసింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులందరికీ రాష్ట్రపతి శుభాకాంక్షలు' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ అన్నారు. గురువారం పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ఆమె ప్రసంగించారు.

- ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుంది
- వికసిత్ భారత్‌కు ప్రజలు మద్దతు ఇచ్చారు
- మూడో సారి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం హర్షణీయం
- ఎయిర్ పోర్టుల సంఖ్యను గణనీయంగా పెంచాం
- గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహిస్తున్నాం
- ఉభయ సభలనుద్దేశించి పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ ప్రసంగం

2



## వారంలో క్యాబినెట్ విస్తరణ..?

- అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం
- నాలుగు రోజులుగా ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి
- పీసీసీ చీఫ్ ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని పార్టీ పెద్దలకు క్లారిటీ
- నామినేటెడ్ పదవుల భర్తీకి కొనసాగుతున్న కసరత్తు

2

## సిమ్ కార్డు రూల్స్ మారాయి

- కొత్త నిబంధనలు ప్రవేశపెట్టిన ట్రాయ్
- పోయిన నెంబర్ తిరిగి కావాలంటే సెవన్ డేస్ ఆగాల్సిందే..



3

# సీతరామ సక్సెస్




గోదావరి జలాలకు నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)
ఓటమితో నత్తనడకన కొనసాగాయి. అనంతరం కాంగ్రెస్ లో చేరిన తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవి దక్కడంతో ప్రాజెక్ట్ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో ఏడు వేల కోట్ల రూపాయలని సీతారామ ప్రాజెక్టు కోసం వ్యయం చేశారు. అయితే ఇప్పటికే కొన్ని చోట్ల భూసేకరణ సమస్యగా ఉంది .ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం కూడా మోటార్లు సిద్ధం అయినప్పటికీ ఇంకా కాలువలు నిర్మాణం పూర్తి కాలేదు. అయితే కొంతమేరకు కాలువల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఏనుకూర్ నుంచి వైరా వరకు మరో కాలువని రూ. 90 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్నారు . ఈ కాలువ నిర్మాణం ఆగస్టు నెలకి పూర్తి అవుతుంది. ఇది పూర్తి అయితే గోదావరి నుంచి సీతారామ ఎత్తి పోతల పథకం ద్వారా సాగునీటిని మోటార్ల ద్వారా తీసుకొని వైరా వరకు సాగునీరు వస్తుంది. వైరా రిజర్వాయర్ నుంచి నాగార్జున సాగర్ ఎడమ కాలువల ద్వారా సత్తుపల్లి వరకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి మంత్రి అయిన దగ్గర నుంచి నిరంతరం సీతారామ ప్రాజెక్టు కోసం నిర్మాణం కోసం పూర్తి చేసేందుకు అధికారులు వెంట పడటం జరిగింది. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు సంబంధించి మోటార్ల ట్రైలరింగ్ గత రాత్రి అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద సక్సెస్ అయింది. ముందుగా ప్రాజెక్టు నిర్మాణాన్ని 13 వేల కోట్ల కి టెండర్లు పిలిచినప్పటికీ ఆ తర్వాత నిర్మాణ వ్యయం పెరగడంతో మొత్తం 17 వేల కోట్లకి పెరిగింది ఖమ్మం జిల్లాలో 4 లక్షల ఎకరాలకు భద్రాద్రి జిల్లాలో మూడు లక్షల ఎకరాలకి మహబూబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకి సాగునీరు అందనుంది

### గోదావరి జలాలను నెత్తిన చల్లుకున్న మంత్రి తుమ్మల

సీతారామ ప్రాజెక్టు సక్సెస్ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 'గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగుకు ఇవ్వాలన్నది నా కోరిక. ఇది నాకు భగవంతుడు ఇచ్చిన అవకాశం . సీతారాం కు భూమి ఇచ్చిన రైతులు అభినందనీయులు.. అధికారులు రేయింబవళ్లు కష్టపడ్డారు. భూములు ఇచ్చిన వారికి పాదాభివందనాలు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మొట్టమొదటిసారిగా ఈ వర్షా కాలంలోనే లక్షన్నర ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఏనుకూరు లింకు కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకి సాగు నీరు ఇస్తాం. లంక సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగర ఆయకట్టు కాకుండా మధ్యలో చెరువులు అన్నింటిని నింపి సాగునీరు అందిస్తాం. ఈ ఏడాది గోదావరి నీళ్లు ఖమ్మం జిల్లాలకు అందిస్తాం. ముఖ్యమంత్రి భద్రాచలం వచ్చినప్పుడు కొద్దిగా డబ్బులు ఇస్తే డబ్బులతో మూడు పంపు హౌస్ లు పూర్తి చేస్తామని చెప్పాం. రేవంత్ రెడ్డి నిధులు ఇచ్చి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు హామి ఇచ్చి నెరవేర్చారు. మొత్తం ఆరు మోటార్లతో 9,000 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నాం. మొదటి లిఫ్ట్ ఇరిగేషన్ బిజీ కొత్తూరు సెకండ్ లిఫ్ట్ పుసుగూడెం మూడవది కమలాపురం. నెలరోజుల్లోనే మూడు పంపు హౌస్ లు పూర్తి చేసి ట్రయిల్ రన్ చేస్తాం. ఎన్కూరు వరకు నీటిని అందించే విధంగా అధికారులు కృషి చేయాలి. మెయిన్ కెనాల్ పూర్తి చేస్తాం. వైరా ప్రాజెక్టుకి ఈ సంవత్సరం నీళ్లు పంపించే ఏర్పాటుగా అధికారులు చర్యలు తీసుకోవాలని' అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి జలాలకు నమస్కరించారు. గోదావరి జలాలను నెత్తిన చల్లుకున్నారు.



పంప్ హౌస్ నుంచి పరుగులు తీస్తున్న గోదావరి

# సింగరేణిని కాపాడుకుంటాం

## ప్రైవేటీకరించేందుకు కేంద్ర కుట్ర చేస్తున్నది
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ కుమ్మక్కయ్యారు
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ జూన్ 27 (ప్రజాస్వరం) :** సింగరేణిని ప్రైవేటీకరించేందుకే కేంద్రం తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని, కేంద్రంతో ముఖ్యమంత్రి కుమ్మక్కై బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సింగరేణి మాజీ ఎమ్మెల్యేలు, సింగరేణి ప్రాంత నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభసాటిగా ఉన్న సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆ తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణ కోసం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ లు కుమ్మక్కై సింగరేణి గనులను అమ్మకానికి పెట్టినట్లు ప్రతి సింగరేణి కార్మికుడికి అర్థమవుతుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ రంగ సంస్థలతో ఉద్యమ కాలం నాటి నుంచే పనిచేస్తున్నారని, సకల జనుల సమ్మె సమయం లో సింగరేణి ప్రాధాన్యతను దేశం గుర్తించిందన్నారు. సమ్మె కాలంలో ఐదు దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయని అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు గొప్పగా పని చేశాయని, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతమే బీఆర్ఎస్ పార్టీ విధానమన్నారు. ఉద్యమ కాలం నుంచి ఆ తర్వాత ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా ఇదే తమ విధానమని తెలిపారు. అందుకే ప్రైవేటు కంపెనీలు ఎంత ఒత్తిడి తెచ్చినా పక్కకు పెట్టి... రైతు బీమాను ఎల్ఐసీకి, విద్యుత్ ప్రాజెక్టులను కట్టే బాధ్యతను బీహెచ్ఈఎల్ కి అప్పగించమని గుర్తుచేశారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్ల పాటు సింగరేణి సంస్థ అభివృద్ధి, విస్తరణ కోసం పనిచేశామని, ఇది ప్రతి సింగరేణి కార్మికుడికి అవగాహన ఉందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు తెలంగాణ బొగ్గు గనులను వేలం వేయకుండా ఆపగలిగామన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రెండు బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించినప్పటికీ... తట్టెడు బొగ్గును కూడా ఎత్తకుండా అడ్డుకున్నామని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం.. గెలిచి రెండు వారాలు కాకముందే బీజేపీ ఎంపీలు ఆ పార్టీ నాయకత్వం కలిసి తెలంగాణ బొగ్గు గనులను వేలంకు పెట్టాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ గొంతుక పార్లమెంట్ లో లేదన్న భ్రమతోనే కాంగ్రెస్, బీజేపీలు ఈ కుటిల ప్రయత్నం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. సింగరేణి కోసం ఆది నుంచి పోరాటం చేసి.. సింగరేణిని బలోపేతం చేసిందే బీఆర్ఎస్ అని వివరించారు. సింగరేణి కష్టాల్లో ఉంటే కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్న విషయం మర్చిపోతున్నారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణిని కాపాడుకుంటుందని తెలిపారు.

# మెట్రో ఆదాయం డబుల్

## గత ఆర్థిక సంవత్సరం రూ.703.20 కోట్లు..
## ఈ ఏడాది 1407-81 కోట్ల రాబడి

**హైదరాబాద్, జూన్ 27, (ప్రజాస్వరం):** నిత్యం అనేక వేల మంది ప్రయాణికులను గమ్యానికి చేరుస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది హైదరాబాద్ మెట్రో. తొలినాళ్లలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తూ మరో పక్క ప్రయాణికుల అవసరాలు తీరుస్తూ దూసుకుపోతోంది. అయితే హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఆదాయం ఏకంగా 105 శాతం పెరిగిందని నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టీ మెట్రో వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1407-81 కోట్ల రాబడి వస్తే గత ఆర్థిక సంవత్సరానికి రూ.703.20 కోట్లు మాత్రమే వచ్చింది. గడిచిన ఆరేళ్లుగా హైదరాబాద్ సిటీలో మైట్రో రైళ్ల వ్యవస్థను నడుపుతున్నారు. కోవిడ్ సమయంలో మెట్రో భారీగా నష్టాలను చవిచూసింది. 2022 మార్చి 31 నాటికి రూ.4108.37 కోట్లు ఉండగా 2023 కు వచ్చేసరికి రూ. 5424.37 కోట్లకు చేరుకుంది. ఇక ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.5979.36 కోట్లకు చేరుకుందని ఎల్ అండ్ టీ వెల్లడించింది. ఎండల ప్రభావం ఒక్కటేకాదు.. సమయం కలిసి వస్తుందనుకునే వారి సంఖ్య పెరగడంతో మెట్రోకు ఆదరణ తగ్గడం లేదు. సోమవారం ఉదయం రోజువారీ కంటే ముందే సేవలు ప్రారంభిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు సేవలను పొడిగించారు. గత రెండు నెలలలో చూస్తే 1,23,95,205 మంది మెట్రోలో ప్రయాణించారు. అంటే రోజువారి సగటున చూస్తే 4.13 లక్షల మంది ప్రయాణించారు. మే నెలలో 1,31,05,805 మంది ప్రయాణించారు. రోజువారి సగటున 4.22 లక్షల మంది ప్రయాణించారు. రద్దీకి తగినట్లు లేక ప్రయాణికుల సంఖ్య 6 లక్షల మందికి పెరగాల్సి ఉందని మెట్రో అంటుంటే.. ఉదయం, సాయంత్రం కార్యాలయాల వేళల్లో విపరీతంగా రద్దీ ఉంటోందని దానికి సరిపడా మెట్రోలు లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

# జులై 4న క్యాబినెట్ విస్తరణ

## నాలుగు రోజులుగా ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి
## అధిష్టానంతో చర్చలు.. పీసీసీ పదవి భర్తీకి లైన్ క్లియర్!

**హైదరాబాద్, జూన్ 27, (ప్రజాస్వరం) :** తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా అంటే అవుననే అంటున్నారు కాంగ్రెస్ నేతలు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలుస్తూనే.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో మార్పులు చేర్పులపై అధిష్టానంతో చర్చిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో సమావేశమైన రేవంత్ రెడ్డి నూతన టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై చర్చించినట్లు తెలుస్తోందితెలంగాణ మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ వేగవంతమైంది. రాష్ట్రంలో 18 మంది మంత్రులకు అవకాశం ఉండగా ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితోపాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఆరుగురికి మంత్రివర్గంలో అవకాశం దక్కనుంది. ఈమేరకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. దీంతో మంత్రి పదవుల కోసం సీనియర్లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణలో ఆరు మంత్రి పదవులతోపాటు 37 నామినేటెడ్ పదవుల భర్తీకి కూడా సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. అయితే వీటిపై కొందరు మంత్రుల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇచ్చే అవకాశం ఉంది.

ఒకటి రెండు రోజుల్లో నామినేటెడ్ పదవుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది.

ఇక ఆరు మంత్రి పదవుల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి, రెండు బీసీలకు, ఒకటి లంబాడీలకు, మరొకటి మైనారిటీలకు ఇస్తారని తెలుస్తోంది. ఆరు పదవుల్లో హోం, విద్య, కార్మిక , మున్సిపల్ కీలకంగా ఉన్నాయి. ఇందులో హోం శాఖను నిజామాబాద్ కు చెందిన సుదర్శన్ రెడ్డికి ఇస్తారని సమాచారం. ఇదిలా ఉండగా మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఈమేరకు అధిష్టానం ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. నలుగురూ రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం. ఇందులో ఇద్దరికి మంత్రి పదవులు, ఒకరికి డిప్యూటీ స్పీకర్ పదవి, మరొకరికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి వరించే అవకాశం ఉంది.

మంత్రి పదవుల ఎంపికలో సామాజికవర్గాల సమీకరణే కీలకం కానుంది. రెడ్డి సామాజికవర్గం నుంచి పోటీ ఎక్కువగా ఉండగా, బీసీలు కూడా ఎక్కువగానే పదవులు ఆశిస్తున్నారు. మరోవైపు వెలమ సామాజిక వర్గం కోటా ఇప్పటికే భర్తీ కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఆయనకు సామాజికవర్గమే అడ్డుగా మారుతోంది.

# చిల్లర టెన్షన్ ఉండదిక..

- ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్స్..!
- బండ్లగూడ డిపోలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు
- త్వరలో హైదరాబాద్ వ్యాప్తంగా ఇంప్లిమెంటేషన్‌కు కసరత్తు




**హైదరాబాద్, జూన్ 27, (ప్రజాస్వరం):** సికింద్రాబాద్ వెళ్లాల్సిన శ్రీనివాస్ హయత్ నగర్ లో బస్ ఎక్కాడు. కండాక్టర్ టికెట్ కొట్టి ఇచ్చాడు. 40 రూపాయలు ఇవ్వమని చెప్పాడు. శ్రీనివాస్ మెల్లిగా ఐదు వందల రూపాయల నోట్ తీసి కండాక్టర్ చేతిలో పెట్టాడు. అసలే ఫస్ట్ ట్రిప్ కావడంతో చిల్లర లేదని చెప్పి టికెట్ పై 460 అని రాసి ఇచ్చాడు. ఫోన్ చూస్తూ తను దిగాల్సిన స్టాప్ లో దిగిపోయాడు. 460 రూపాయలు మర్చిపోయాడు. 40 రూపాయలు చిల్లర లేనందుకు శ్రీనివాస్ కు 460 చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇది ఒక్క శ్రీనివాస్ అనుభవమే కాదు. మీరు హైదరాబాద్ లో ఉండి ఉంటే కచ్చితంగా ఇలాంటి అనుభవాన్ని ఫేస్ చేసి ఉంటారు. ఆ కండక్టర్ మంచి వాడు కాబట్టి చీటీ రాసి ఇచ్చాడు. వేరే వాళ్లు అయితే ఏకంగా వాగ్వాదమే పెట్టుకుంటారు. చిల్లర ఎక్కడి నుంచి తీసుకురావాలని చిర్రుబుర్రులాడుతారు. ఇప్పుడు అలాంటి వాటికి అవకాశం లేకుండా చేయనున్నది తెలంగాణ ఆర్టీసీ. హైదరాబాద్ సిటీ బస్ లలో డిజిటల్ పేమెంట్స్ తీసుకు రానుంది. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ప్రక్రియ విజయవంతం కావడంతో ఇప్పుడు మరికొన్ని రూట్ లలో ప్రవేశ పెట్టాలని భావిస్తోంది. ఆర్టీసీ బస్ లలో ప్రయాణించే వాళ్లకు చిల్లర బాధ అంతా ఇంతా కాదు. డిజిటల్ చెల్లింపులు వచ్చాక బయట చిల్లర దొరకడమే కష్టంగా మారిపోయింది. ఏటీఎంకు వెళ్లినా అక్కడ కూడ వంద, 200, 500 నోట్ లే వస్తున్నాయి. దీంతో బస్ ఎక్కే వాళ్ల వద్ద చిల్లర కనిపించడం చాలా అరుదు. దీంతో నిత్యం ఆర్టీసీ సిబ్బందితో వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిని గమనించిన తెలంగాణ ఆర్టీసీ డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను బండ్లగూడ డిపోలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టింది. ఇది విజయవంతం కావడంతో డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను మిగతా ప్రాంతాలకు విస్తరించాలని చూస్తోంది. బండ్లగూడలోని 70 బస్సుల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు ఉంటే టికెట్ తీసుకోవచ్చు. సుమారు నెల రోజుల నుంచి విజయవంతంగా నడుస్తుందీ ప్రక్రియ. బండ్లగూడ డిపో బస్సుల్లో డిజిటల్ చెల్లింపుతో టికెట్ తీసుకోవడంలో ఉన్న లోపాలు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రయాణికుల ఇబ్బందులు, టికెట్ ఇవ్వడానికి చెల్లింపులకు ఎంత టైం పడుతుంది ఇలా అన్నింటినీ పరిశీలించింది ఆర్టీసీ. పెద్దగా సాంకేతిక సమస్యలు తలెత్తలేదని గ్రహించి మిగతా ప్రాంతాలకు విస్తరించాలని ఆలోచనలో ఉంది ఆర్టీసీ. గ్రేటర్ పరిధిలో ఉన్న దాదాపు 2900 బస్సుల్లో ఈ డిజిటల్ చెల్లింపు ప్రక్రియను త్వరలోనే ప్రవేశ పెట్టనున్నారు. దీని వల్ల 15 లక్షల మందికిపైగా ప్రయాణికులకు మేలు జరుగుతుందని సిబ్బందిపై చిల్లర ఒత్తిడి తగ్గుతుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

# భక్తులకు ఇబ్బందులు రావొద్దు



ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల వాల్ పోస్టర్ ను విడుదల చేస్తున్న మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి

**సికింద్రాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం):** ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని నగర ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జులై 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు, రంగం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. కేవలం ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రి మినహా కార్లకు లోనికి అనుమతి లేదని, జేమ్స్ స్ట్రీట్ ప్రధాన రోడ్డు వద్దనే వీఐపీ ల కార్లు నిలిపి, అక్కడి నుండి నడుచుకుంటూ దర్శనానికి రావాలని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మహంకాళి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ. కార్పొరేటర్స్, చీర సుచిత్ర, కొంతం దీపిక పాల్గొన్నారు.

# పీసీసీ చీఫ్ గా ఎవరొచ్చినా ఓకే



న్యూఢిల్లీ జూన్ 27 : ఢిల్లీ మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్ చేశారు. నా పీసీసీ అధ్యక్ష పదవీకాలం ముగిసింది. అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పనిచేస్తా. అధ్యక్షుడి నియామకంపై నాకంటూ ప్రత్యేక చాయిస్ ఏదీ లేదు. అధిష్టానం ఎవరిని నియమించినా వారితో కలిసి పనిచేయడమే నా బాధ్యత. నా పదవి కాలంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చింది. పార్లమెంటు ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచామని అన్నారు.

# అధిష్టానం ఆశీస్సులున్నా.. సంజయ్ ఒంటరేనా..?

## అధికారంలో ఉన్నప్పుడు ఇబ్బందులు పెట్టాడని కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

**కరీంనగర్, జూన్ 27, (ప్రజాస్వరం):** కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి తెలియకుండా కాంగ్రెస్ కండువా కప్పుకున్న డాక్టర్ సంజయ్ విషయంలో జగిత్యాల కాంగ్రెస్ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకత్వంతో సంబంధం లేకుండా జాయిన్ చేసుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాము ఎదుర్కొన్న కేసుల పరంపర గురించి కూడా వారంతా బాధపడుతున్నారు. అప్పుడు తమను ముప్పు తిప్పలు పెట్టడానికి కారణమైన ఎమ్మెల్యే సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్పించు కోవడం సరైన నిర్ణయం కాదని జగిత్యాల కాంగ్రెస్ నాయకులు కుండబద్దలు కొడుతున్నారు. దీంతో డాక్టర్ సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ జగిత్యాల ద్వితీయ శ్రేణి నాయకులతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందా అన్నదే అంతు చిక్కని ప్రశ్న. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆయన నాయకత్వంలో పార్టీలో కొనసాగేందుకు ఆసక్తి చూపుతారా లేక.. అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తారా అన్న చర్చ సాగుతోంది.మరోవైపున దశాబ్దానికి పైగా అనుబంధం పెనవేసుకున్న బీఆర్ఎస్ పార్టీలోనూ సంజయ్‌కి అనుకూలంగా ఉండే సెకండ్ క్యాడర్ లేకుండా పోయింది. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినందున తనతో కలిసి నడిచేందుకు రావాలని డాక్టర్ సంజయ్ నుండి ఆహ్వానాలు అందుతున్నా సుముఖత వ్యక్తం చేస్తున్న వారే కరువైనట్టుగా సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినట్టయితే బావుంటుదని ఆయన సముదాయించి చెప్తున్నప్పటికీ, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో పాటు ఇతర నాయకులు పార్టీ మారేందుకు మాత్రం సానుకూలత వ్యక్తం చేయడం లేదని తెలుస్తోంది. జగిత్యాలలో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలను గమనిస్తే మాత్రం పూర్వ పార్టీకి చెందిన వారే అయినా.. జాయిన్ అయిన పార్టీకి చెందిన వారే అయినా కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేతో కలిసి వచ్చే అవకాశాలైతే కనిపించడం లేదు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న పరిణామాలు మాత్రం సంజయ్ ని ఒంటరిని చేసినట్టుగానే కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులు కలిసి రాక.. కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతించే పరిస్థితి లేకపోయిన తీరును ఆయన ఎలా అధిగమిస్తారన్నదే మిస్టరీగా మారింది..!

# ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగాం

- ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుంది
- వికసిత్ భారత్‌కు ప్రజలు మద్దతు ఇచ్చారు
- ఉభయ సభలనుద్దేశించి పార్లమెంట్‌లో రాష్టపతి ద్రౌపది ముర్మూ ప్రసంగం

**ఢిల్లీ, జూన్ 27:** లోక్ సభ సమావేశాల్లో భాగంగా గురువారం సభ ప్రారంభమైంది. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను పార్లమెంటు ముందుంచారు. భారత్ లో జరిగిన ఎన్నికలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, భారత ప్రజలు వరుసగా మూడోసారి మెజారిటీతో సుస్థిర ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేశారో ప్రపంచం చూసిందని చెబుతూ ఆమె ప్రసంగాన్ని కొనసాగించారు. 18వ లోక్ సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులందరికీ ఈ సందర్భంగా రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. మీరంతా దేశ ఓటర్ల విశ్వాసాన్ని చూరగొన్నారు. ప్రజల ఆశలు, ఆక్షాంక్షలకు అనుగుణంగా పని చేయాలని రాష్ట్రపతి హితవు పలికారు. ప్రజల నమ్మకాన్ని మీరు వమ్ము చేయరని భావిస్తున్నా, కొత్త స్పీకర్ ఓం బిర్లా ప్రజాస్వామ్య పరిరక్షణ చేస్తారని ఆశిస్తున్నానన్నారు. ఇటీవల ముగిసిన లోక్ సభ ఎన్నికలను కూడా ఆమె ప్రస్తావించారు. ప్రపంచంలోనే ఇవే అతిపెద్ద ఎన్నికలని అన్నారు. దాదాపు 64 కోట్ల మంది ఓటర్లు తమ కర్తవ్యాన్ని ఉత్సాహంగా నిర్వర్తించారు. అనేక దశాబ్దాలుగా కశ్మీర్ లోయలో ఓటింగ్ జరగలేదన్న రాష్ట్రపతి, తొలిసారిగా రికార్డులు బద్దలై జమ్మూ కాశ్మీర్ నుంచి ఈ ఎన్నికలలో విజయం సాధించి ఎంపీగా పార్లమెంటులో అడుగుపె ట్టారన్నారు. నాలుగు దశాబ్దాలుగా జమ్మూకశ్మీర్ విష యంలో శత్రువులు దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్ని కల్లో జమ్ముకశ్మీర్ విషయంలో మార్పు కనిపించింది. ప్రభుత్వం, ప్రజాస్వామ్యంపై ప్రజలు విశ్వాసం ఉంచారు. వారి ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేస్తుందని ప్రజలు నమ్మారన్నారు.

2024 లోక్ సభ ఎన్నికలపై నేడు ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. భారతదేశ ప్రజలు వరుసగా మూడో సారి స్థిరమైన, స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రపంచం గమనిస్తోంది. ఇది ఆరు దశాబ్దాల తర్వాత జరిగింది. ప్రజల ఆకాంక్షలు అత్యున్నత స్థాయిలో ఉన్న తరుణంలో అందుకు అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రభుత్వంపై ప్రజలు వరుసగా మూడోసారి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తు తం ప్రభుత్వం తమ ఆకాంక్షలను నెరవేరుస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. సురక్ష, అభివృద్ధి విషయంలో ప్రజలు విశ్వాసం ఉంచారు. ప్రభుత్వ గ్యారెంటీల విషయంలోనూ ప్రజలు విశ్వసించారు. వికసిత్ భారత్ నినాదానికి ప్రజలు మద్దతు ఇచ్చారన్నారు.

ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడుల గురించి మాట్లాడుతూ, ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడిదారులను ఆకర్షించడానికి రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని రాష్ట్రపతి ముర్మూ అభిప్రాయపడ్డారు. ఇది పోటీ సహకార సమాఖ్య, నిజమైన స్ఫూర్తి. రాష్ట్రాభివృద్ధి ద్వారా దేశాభివృద్ధి, ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదామన్నారు. సంస్కరణలు, పనితీరు, రూపాంతరం చెందాలనే సంకల్పం నేడు భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మార్చిందని ఆమె అన్నారు. 10 సంవత్సరాలలో, 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా ఎదిగామన్నారు. 2021-2024 మధ్య భారతదేశం సగటున 8 శాతం వృద్ధిని సాధించిందని రాష్ట్రపతి స్పష్టం చేశారు.

అన్ని సభల్లోకెల్లా ఈసారి సభ ఎంతో విశిష్టమైంది. ప్రజల నమ్మకానికి తగ్గట్టే ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టబో తోందన్నారు రాష్ట్రపతి. ఆర్థికంగా పేదలకు మేలుజరిగే ఎన్నో అంశాలు బడ్జెట్ లో ఉంటాయన్నారు. ప్రపంచంలో 5వ బలమైన ఆర్థికవ్యవస్థగా భారత్ ఎదిగింది. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. కరోనా లాంటి కష్టకాలాన్ని గట్టిగా ఎదుర్కొ న్నాం. ఇప్పుడు భారత్ మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగబోతోందని జోస్యం చెప్పారు. సర్వీస్ సెక్టార్లను కూడా ప్రభుత్వం బలపరుస్తోంది. ఉద్యోగ కల్పనలోనూ ప్రభుత్వం కృషిచేస్తోంది. రైతుల సంక్షేమం కోసం పెద్ద నెట్ వర్క్ ఏర్పాటు చేస్తోంది. రైతులు తమ చిన్నచిన్న ఖర్చులను తీర్చుకునేందుకు వీలుగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.3 లక్షల 20 వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చామని చెప్పారు. ఖరీఫ్ పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను రికార్డు స్థాయిలో పెంచింది. ఎన్నో మార్పులు తీసుకువచ్చామని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ప్రజాక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామన్న రాష్ట్రపతి, గ్లోబల్ మార్కెట్ లో డిమాండ్ కు తగ్గ పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ తో దేశప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తున్నాం. అడవుల విస్తరణకు కృషిచేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పదేళ్లలో ఎయిర్ పోర్టుల సంఖ్యను గణనీయంగా పెంచామన్న రాష్ట్రపతి..- పదేళ్లలో 21నగరాల్లో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టామన్నారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ ను నిలబెట్టామన్నారు. పీఎం గ్రామీణ్ సడక్ యోజనతో 3.80లక్షల కి.మీ రోడ్లు వేశాం. వేగమైన వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాం. తొలిసారి అంతర్జల రైలు మార్గానికి పునాది వేశాం. ఆధునికతను అనుసరించి మా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఉభయ సభల సంయుక్త ప్రసంగంలో నీట్ పేపర్ లీక్ గురించి ప్రస్తావించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున దుమ్మెత్తిపోశాయి. దేశంలోని ప్రతి యువకుడికి పెద్ద కలలు కనడానికి, వాటిని నెరవేర్చుకోవడానికి సరైన వాతావరణాన్ని కల్పించడంలో మా ప్రభుత్వం నిమగ్నమై ఉందని ఆమె అన్నారు.

# నింపాదిగా గులాబీ బాస్

హైదరాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం) :



పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయాలు మరింత డైనమిక్‌గా మారిపోయాయి. భారత రాష్ట్ర సమితి ఒక్క ఎంపీ స్థానం కూడా గెలుచుకోకపోవడం మెజార్టీ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో ఆ పార్టీ భవిష్యత్‌పై నేతల్లో ఆందోళన ప్రారంభమయింది. లోక్ సభ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా చూస్తే అసెంబ్లీ స్థానాల్లో కేవలం మూడు అంటే మూడు స్థానాల్లో మాత్రమే ఆధిక్యత లభించింది. వ్యూహాత్మకంగా బీజేపీకి బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చిందన్న ఓ ప్రచారం ఉంది. అయితే అది వ్యూహమా.. లేకపోతే నిర్లక్ష్యమా అన్న సంగతి పక్కన పెడితే ఆ ఎన్నికల ఫలితాలు ఇప్పుడు పార్టీ ఉనికిపై ప్రభావం చూపేలా ఉన్నాయి. పార్టీ హైకమాండ్‌కు అత్యంత సన్నిహితులైన వారు కూడా పార్టీ మారిపోతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో వచ్చిన ఫలితాలు బీఆర్ఎస్ పార్టీ ఎంత ఘోరంగా వెనుకబడిపోయిందో చాటి చెప్పేలా ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో బీఆర్ఎస్‌కు మూడు అంటే మూడు సీట్లు వస్తాయి. అందులో రెండు గజ్వేల్, సిద్దిపేట. వినడానికి కాస్త అతిశయంగా ఉన్నా లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఫలితాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి. తెలంగాణలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో%౯౦% అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆధిక్యాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ పార్టీకి మూడు చోట్ల మాత్రమే ఆధిక్యత లభించింది. లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఆధిక్యతలను చూస్తే.. కాంగ్రెస్ పార్టీ తన స్థానాలు కొన్ని మారినా మొత్తంగా 64 సీట్లలో ఆధిక్యాన్ని చూపించుకుంది. బీజేపీ ఏకంగా 45 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యాన్నిచూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎనిమిది స్థానాలు మాత్రమే వచ్చాయి. మజ్లిస్ పార్టీ తన సెగ్మెంట్లలో ఆధిక్యాన్ని నిలుపుకుంది. నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39సీట్లను సాధించుకుంది. కాంగ్రెస్ మిత్రపక్షంతో కలిసి అరవై ఐదు గోల్చుకోగా.. బీజేపీ ఎనిమిది దగ్గర ఆగిపోయింది. పార్లమెంట్ ఎన్నికల నాటికి అంటే ఐదు నెలల్లోనే బీఆర్ఎస్ బీజేపీకి తన బలాన్ని కోల్పోయిందిపార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్, బీజేపీ బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్లను చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి సహజంగా ఎమ్మెల్యేలు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లు ఆ పార్టీని షాక్‌కు గురి చేశాయి. మొత్తం పది స్థానాల్లో కలిపి లక్షన్నర ఓట్లు కూడా రాలేదు. దీంతో కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా పేరు పడిన బాన్స్ వాడ ఎమ్మెల్యే , మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. వీరు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలిస్తే.. బీఆర్ఎస్ ఆపేందుకు అన్ని రకాల ఒత్తిళ్లు పెడుతుందని తెలుసుకాబట్టి.. వారికి కండువా కప్పిన తర్వాతనే అసలు విషయం వెలుగులోకి వచ్చేలా చేశారు. ఇక వారితో పెద్దగా సాన్నిహిత్యం లేని.. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లో చేరిన ఎమ్మెల్యేలు ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ సిగ్నల్ ఇస్తే అప్పుడు ఆ పార్టీలో చేరిపోవడానికి రెడీగా ఉన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టేందుకు అసెంబ్లీ సమవేశాలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఆ సమావేశాల్లోపు కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేస్తామని కాంగ్రెస్ పార్టీ అంటోంది. నిజానికి కేసీఆర్ తో సాన్నిహిత్యం ఎక్కువగా ఉన్న వారికి ముందుగా కండువాలు కప్పుతున్నారు. తర్వాత అందరికీ సామూహికంగా కండువాలు కప్పుతారని అంటున్నారు. అయితే ఒక్క కాంగ్రెస్ పార్టీనే కాదు.. ఈ విషయంలో బీజేపీ కూడా చాపకింద నీరులా తమ ప్రయత్నాలు తాము చేస్తోందన్న అనుమానాలు ఉన్నాయి. కొంత మంది ఎమ్మెల్యేలతో బీజేపీ నేతలు టచ్ లో ఉన్నారు. కాంగ్రెస్‌లోకి పోయేవారు పోగా.. మిగిలిన వారు బీజేపీలో చేరే అవకాశం ఉంది. మొత్తంగా బీఆర్ఎస్‌కు నలుగురు, ఐదుగురు ఎమ్మెల్యేలు మిగలడం కష్టమని కాంగ్రెస్ నేతలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అదే జరగవచ్చని అనిపిస్తోంది.పార్టీ దుర్భర పరిస్థితుల్లో ఉంటే అధినేత కేసీఆర్ పట్టించుకోవడం మానేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం అయిపోయిన తర్వాత ఆయన ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు. పూర్తిగా వ్యవసాయం మీద దృష్టి పెట్టారు. ఎవరైనా పార్టీ నేతలు వస్తానంటే కలుస్తున్నారు కానీ.. అదీ కూడా చాలా తక్కువే. గ్రేటర్ పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ చర్చలు జరిపిన విషయం తెలియడంతో ఫామ్ హౌస్‌కు పిలిచి మాట్లాడారు. ఆ తర్వాత ఇక ఏ విషయాలు పట్టించుకోవడం లేదు. తనకు అత్యంత సన్నిహితులు కూడా పార్టీ వీడి పోతున్నా స్పందిండం లేదు. మామూలుగా అయితే కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి పోరాడతారని క్యాడర్ అనుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అనైతిక పద్ధతులకు పాల్పడి .. తెలంగాణ అస్థిత్వం అయిన బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తోందని ప్రజల్లో సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తారని అనుకున్నారు. కానీ కేసీఆర్ ఏమీ పట్టనట్లుగానే ఉన్నారు. పోతే పోనీ అన్నట్లుగా కేసీఆర్ ఉండటం ఆ పార్టీ క్యాడర్ ను కూడా ఆశ్చర్య పరుస్తోంది.కేటీఆర్ కూడా వలసలపై పెద్దగా ఆందోళన చెందుతున్నట్లుగా కనిపించడం లేదు. పవర్‌లో ఉన్న పాలకుల కన్నా ప్రజల పవర్ ఎక్కువ అని కొటేషన్లు చెప్పి ట్వీట్లు పెట్టి ఊరుకుంటున్నారు. ఎమ్మెల్యేలు జారిపోతారని తెలిస్తే.. ఒకటి రెండు సార్లు చెప్పి చూసి వదిలేస్తున్నారు. అయితే పార్టీని వీడిపోతే.. అనర్హతా వేటు వేయించే విషయంలో వెనక్కి తగ్గబోమని మాత్రం హెచ్చరిస్తున్నారు. బుజ్జగించడం కన్నా హెచ్చరికల మీదనే దృష్టి పెడుతున్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లి అయినా పదవి ఊడగొడతామని అంటున్నారు. మహారాష్ట్ర విషయంలో సుప్రీంకోర్టు పెట్టిన మూడు నెలల గడువును చూపిస్తున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఎవరైనా పార్టీ ఫిరాయిస్తే వెంటనే అనర్హతా వేటు వేయవచ్చు. కానీ అది వందశాతం స్పీకర్ కు ఉన్న అధికారం. కోర్టులు కూడా జోక్యం చేసుకోలేవు. ఫలానా సమయం లోపు నిర్ణయం తీసుకోవాలన్న రూల్ కూడా లేదు. అందుకే అధికారంలో ఉన్న వారికి ఫిరాయింపుల నిరోధక చట్టం ఓ ఆయుధంగా కనిపిస్తోంది.గతంలో బీఆర్ఎస్ వాడుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ వాడుతోంది. ఈ బెదిరింపులతో ఎమ్మెల్యేల్ని ఆపలేరని బీఆర్ఎస్ నేతలకూ తెలుసు. అయితే బీఆర్ఎస్ నేతలు తమ ప్రయత్నాలు మాత్రం తాము చేస్తున్నారని అనుకోవచ్చు.ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే.. బీఆర్ఎస్ లీడర్లే కాదు క్యాడర్ కూడా పార్టీ మారిపోతారు. మాములుగా అయితే బీఆర్ఎస్ పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కాంగ్రెస్ పై ప్రజలకు కోపం వస్తే తమకే ఓట్లేస్తారని అనుకుంటారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రత్యామ్నాయంగా బీజేపీ పూర్తి స్థాయిలో ఎదిగి ఎదురుగా నిలుచుంది. అందరికీ అన్ని అవకాశాలు ఇచ్చారు.. మాకు ఒక్క చాన్స్ ఇవ్వమని అడుగుతోంది. ఇలాంటి సమయంలో ఓటర్లు ఆ పార్టీ వైపు మొగ్గుతున్నారని పార్లమెంట్ ఎన్నికలతో బయటపడింది. అదే ఇప్పుడు బీఆర్ఎస్‌కు అసలు సమస్య. తమ పార్టీకి పెట్టని కోట లాంటి తెలంగాణ సెంటిమెంట్ కరిగిపోయింది. ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునే మరో తెలంగాణ సెంటిమెంట్ లాంటి ఆయుధం దొరికితే కానీ బీఆర్ఎస్ ఉనికి పోరాటంలో సక్సెస్ కాదు. మరి అలాంటి ఆయుధం సృష్టించుకోకుండా కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో వ్యవసాయం చేసుకుంటున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతల్లో మరింత ఆందోళన పెరుగుతోంది.

## శ్రీ కుక్కే సుబ్రమణ్యస్వామివారి సేవలో ప్రభుత్వ విప్ ఆది

ధర్మపురి, జూన్ 27(ప్రజాస్వరం):

కర్నాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లాలోని సుప్రసిద్ధ శ్రీ కుక్కే సుబ్రమణ్యస్వామి వారిని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అర్చకులు వారిని ఆశీర్వదించారు. వారి వెంట ఆలయ అధికారులు, అర్చకులు ఉన్నారు.

# దూకుడు... ప్లస్సా... మైనస్సా....

హైదరాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం) :

దూకుడు కొన్నిసార్లు సక్సెస్ ఫార్ములా అవుతుంది. మరికొన్ని సార్లు పెద్ద దెబ్బ తగిలేలా చేస్తోంది. రాజకీయ రంగంలో కూడా అంతే. దూకుడు రాజకీయాలు కొన్నిసార్లు ప్రత్యర్థుల మైండ్ బ్లాంక్ చేస్తాయి. కొన్ని సార్లు ఆ దూకుడు నిర్ణయాలే ప్రత్యర్థులకు అస్త్రాలుగా మారతాయి. ఇక తెలంగాణ పాలిటిక్స్ విషయాలకు వస్తే.. సీఎం రేవంత్ రెడ్డి అంటే ఓ దూకుడు స్వభావం ఉన్న రాజకీయ నేత. ఆ స్వభావమే రేవంత్ రెడ్డిని సీఎం పీఠం ఎక్కించింది.ప్రతిపక్షంలో ఏ పార్టీ అయినా, లేదా పొలిటికల్ లీడర్ అయినా దూకుడుగా ప్రభుత్వం మీదకి వెళ్లడం వల్లే ప్రజల్లో ఓ ఇమేజ్ బిల్డ్ అవుతుంది. కాని అధికారం పక్షంలో ఉన్న వారికి మాత్రం చట్టం, నిబంధనలు, ప్రజల మూడ్ వంటివి ఆ దూకుడుకు ప్రతిబంధకాలు. ఆచి తూచి నిర్లయాలు తీసుకోవాల్సిన పరిస్థితి అధికారంలో ఉన్న వారిది. అయితే ప్రతిపక్షంలో చేసినట్లే ఇప్పుడు పాలనాపరంగాను, రాజకీయంగాను చేస్తే మాత్రం ఎదురు దెబ్బలు తప్పవు. ప్రతిపక్షంలో ఉన్న దూకుడు స్వభావమే ఇప్పుడు రేవంత్ రెడ్డిని దెబ్బ తీస్తోందా అంటే అవుననే చెప్పాలి. అందుకు రెండు ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఒకటి పాలన పరమైనది, అయితే రెండోది పార్టీ రాజకీయానికి సంబంధించినది. పాలనా పరమైన విషయానికి వస్తే.. రాష్ట్ర చిహ్నంలో మార్పు. కేసీఆర్ హయాంలో రూపొందించిన రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేపట్టాలని రేవంత్ రెడ్డి తీసుకున్న దూకుడు నిర్ణయంపై తెలంగాణ వ్యాప్తంగా తీవ్రంగా చర్చ సాగింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్ వంటివి తొలగిస్తారన్న ప్రచారం జరిగింది. ఇవి రాజకరికపు ఆనవాళ్లు అన్న వ్యాఖ్యలు అధికార పక్షం నుండి వినపడ్డాయి. కాని కాకతీయుల వైభవం, చార్మినార్ సింబల్ అనేది తెలంగాణ చరిత్రతో ముడిపడిన అంశం. వీటిని తొలగిస్తారన్న ప్రచారాన్ని బీఆర్ఎస్ నేతలు చక్కగా వాడుకున్నారు. ప్రజల్లో కూడా కొంత భావోద్వేగం బయపడింది. దీంతో సర్దుకున్న సీఎం రేవంత్ రెడ్డి దీనిపై శాసన సభలో అన్ని పార్టీలతో చర్చించి ఓ నిర్ణయానకి వస్తానని చెప్పి రాష్ట్ర చిహ్నం మార్పును పక్కన పెట్టారు. అంటే ప్రజలను తన ఆలోచన ప్రకారం సిద్ధం చేయకుండా భావోద్వేగమైన అంశాల్లో ఒకే సారి మార్పులు చేపడితే వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందని రేవంత్ రెడ్డి కొంత ఆలస్యంగా గ్రహించారు. దూకుడుగా నిర్ణయం తీసుకోవాలనుకున్నా... ఇది ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన విషయమని పాక్షికంగా మార్పు నిర్ణయాన్ని పక్కన పెట్టారు. ఇక ఇప్పుడు రాజకీయంగా చూస్తే... జీవన్ రెడ్డి వ్యవహారం రేవంత్ రెడ్డి దూకుడు నిర్ణయానికి మరో ఉదాహరణ. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రాజకీయంగా కాంగ్రెస్ తీవ్ర దుస్థితిని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ కు పెద్ద పెద్ద నేతలే కారెక్కేసారు. కాని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మాత్రం కేసీఆర్ ఆహ్వానించినా పార్టీలో చేరనని, సున్నితంగా తిరస్కరించారు. ఆ సమయంలో జీవన్ రెడ్డి సీనియర్ లీడర్ గా తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి. కాంగ్రెస్ పార్టీలోను సీనియర్. అధిష్టానానికి విధేయుడు. సౌమ్యుడు. అంతే కాదు ఎలాంటి మరకలు లేని వ్యక్తిత్వం. అలాంటి లీడర్ కు తెలియకుండా.. తనపై పోటీ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను రేవంత్ గుట్టు చప్పుడు కాకుండ పార్టీలోకి తీసుకురావడం ఇప్పుడు కాంగ్రెస్ లో చర్చాంశనీయంగా మారింది.సాధారణంగా పార్టీలో ఎవరైనా కొత్తగా చేరాలంటే ఏ జిల్లా నేత అయితే చేరతారో.... ఆ జిల్లా పార్టీ ముఖ్య నేతలతో చర్చిస్తారు. ఆ చేరే నాయకుడి వల్ల రాజకీయంగా జిల్లాలో చూపే ప్రభావాన్ని అంచనా వేస్తారు. స్వంత పార్టీ నేతల ఇబ్బందులపైన చర్చించాకే... కొత్త లీడర్ ను చేర్చుకుంటారు. లేదంటే జిల్లాలో ముఖ్యమైన సీనియర్ లీడర్ తో అయినా చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అలాంటిది ఏకపక్షంగా రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ను పార్టీలోకి తీసుకోవడం ఓ దూకుడు నిర్ణయంగానే చెప్పాలి. ఈ నిర్ణయంతో కినుక వహించిన జీవన్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. తనకు తెలియకుండా సంజయ్ కుమార్ ను ఎలా పార్టీలో చేర్చుకుంటారని అసమ్మతి గళం విప్పారు. దీంతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఆయనతో చర్చించి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అయితే ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండటం వల్ల జీవన్ రెడ్డి రాజీనామా చేసే విషయంలో వేచి చూసే ధోరణితో ఉన్నారు.. పార్టీ లైన్ ఇది కాదని సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి కొంత ధిక్కార స్వరం వినిపించడం జరిగింది.ఈ వ్యవహారం టీ కప్పులో తుపానుగా ఉంటుందా.. లేక రాజకీయ తుపానుగా రానున్న రోజుల్లో దారి తీస్తుందా వేచి చూడాలి. ఎందుకంటే.. ఎన్నికల ముందు కాంగ్రెస్ లోచాలా మంది సీఎం సీటు ఆశించిన వారే. ఈ తరహా దూకుడు అలాంటి కొంత మంది అసంతృప్త నేతలకు అస్త్రంగా మారే ప్రమాదం లేకపోలేదు. సీఎం సీటుకు తనతో పాటు పోటీ పడిన నేతలతో పోల్చితే.. రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయాలతోనే తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించారనడంలో సందేహం లేదు. ఆ కారణంగానే సీనియర్లు కాదని, మంత్రి పదవి చేపట్టని రేవంత్ రెడ్డిని ఏకంగా కాంగ్రెస్ అధిష్టానం సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. ఇప్పుడు అదే దూకుడు తనకు మేలు చేస్తుందా.. లేదా రాజకీయంగా కీడు చేస్తుందా అన్నది మాత్రం రానున్న రోజుల్లో అర్థం అవుతుంది. జాతీయ పార్టీల కోణం నుండి చూస్తే... స్టీరింగ్ మన చేతిలో ఉన్నా... అధిష్టానం డైరెక్షన్ లోనే బండి నడపాల్సి ఉంటుంది. ఇది రేవంత్ రెడ్డికి తెలియనిదేమి కాదు. కాని ఏదైనా నిర్ణయం తీసుకున్న తర్వాతే దాని ఫలితాలే... మన పని తీరుకు గీటు రాయిగా నిలుస్తాయి. తీసుకున్న నిర్ణయం దూకుడుతనంతో తీసుకున్నాదా... లేదా ఆలోచించి తీసుకున్నాదా అని. చూద్దాం రానున్న రోజుల్లో ఈ దూకుడు మరిన్ని విజయాలను రేవంత్ రెడ్డికి అందిస్తుందా... లేక బ్రేక్ వేస్తుందా అన్నది తేలాలంటే మాత్రం కొంతకాలం వేచి చూడాల్సిందే.

# గొర్రెల డొంక కదులుతోంది..



హైదరాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం) :

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గొర్రెల పథకం కుంభకోణానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఓఎస్డీగా వ్యవహరించిన కళ్యాణ్ కుమార్ ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసును మరింత లోతుగుగా దర్యాప్తు చేపట్టిన అధికారులకు విస్తుపోయే వాస్తవాలు తెలుసుకున్నట్టు సమాచారం.బీఆర్ఎస్ హయాంలో పశు సంవర్థక శాఖ మంత్రిగా చేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఓఎస్టీగా పనిచేశాడు గుండమరాజు కళ్యాణ్ కుమార్. ఇతను మీడియేటర్ల ద్వారా తన సన్నిహితుల బ్యాంకు ఖాతాలకు లంచం సొమ్మును బదిలీ చేయించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. తెలంగాణ వ్యాప్తంగా షీప్ రియరింగ్ డిస్ట్రిబ్యూషన్ పథకాన్ని పర్యవేక్షించిన కళ్యాణ్ కుమార్‌తో పాటు మరికొందరు అనధికారికంగా ఒక్కో యూనిట్‌కు రూ.2 వేల చొప్పున లబ్ది పొందినట్లు దర్యాప్తులో తేలింది. సంబంధిత సొమ్మును మీడియేటర్ల నుంచి తన సన్నిహితుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించుకున్న విషయాన్ని ఏసీబీ వెలిబుచ్చింది. నగదు బదిలీ అయిన రోజు జరిగిన ఫోన్ సంభాషణలను రికార్డు చేయడం ద్వారా కీలక ఆధారాలను ఏసీబీ అధికారులు గుర్తించారు.గొర్రెల పథకంలో రామరాజు అనే వ్యక్తి దాదాపు 380 యూనిట్లను సరఫరా చేసినట్లు రికార్డుల్లో ఉంది. ఈ క్రమంలోనే రామరాజు వద్ద పని చేసిన వినయ్‌కి చెందిన బ్యాంకు ఖాతాను ఏసీబీ అధికారులు పరిశీలించారు. గతేడాది నవంబర్ 4న మధ్యాహ్నం 1.47 గంటల సమయంలో వినయ్‌కు రామరాజు ఫోన్ చేసినట్లు తేలింది. రెండు ఫోన్ నెంబర్లను సమకూర్చి వాటికి నగదు బదిలీ చేయాలని వినయ్‌కు సూచించినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వినయ్ బ్యాంక్ ఖాతా ద్వారా పశుసంవర్ధక శాఖలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి ఫోన్ నెంబర్ ఆన్‌లైన్‌లో 50 వేలు బదిలీ చేసినట్లు గుర్తించారు. అలాగే, కళ్యాణ్ సన్నిహితుడి భార్య ఖాతాకు 2 లక్షలు బదిలీ చేసినట్లు వెల్లడైంది. నగదు బదిలీ జరిగిన రోజు సదరు సన్నిహితుడు ఉదయం 10.59 గంటలకు కళ్యాణ్ కుమార్‌కు ఫోన్ చేసినట్లు తేలింది. కళ్యాణ్ రెగ్యులర్‌గా మహిళా ఉద్యోగితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుసుకున్నారు అధికారులు. వినయ్, రామరాజు నుంచి మహిళా ఉద్యోగికి ఎలాంటి ఫోన్ కాల్స్ లేవు. గొర్రెలను సమకూర్చడంలో కీలకంగా వ్యవహరించిన రామరాజు నుంచి కళ్యాణ్‌కు అనధికారికంగా నగదు సమకూరినట్లు అధికారులు గుర్తించారు. రామరాజు తన ఉద్యోగి వినయ్ ద్వారా కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉన్న మహిళా ఉద్యోగి ఖాతాకు నగదు బదిలీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అదే రోజు మహిళా ఉద్యోగికి కళ్యాణ్ కుమార్ రెండుసార్లు ఫోన్ చేయగా, ఆమె మరో రెండు సార్లు ఫోన్ చేసినట్లు గుర్తించారు. అలాగే, కళ్యాణ్ కూమార్ సీఆర్జీఏ విశ్లేషించగా మహిళా ఉద్యోగి నుంచి 1894 ఇన్‌కమింగ్ కాల్స్ ఉన్నట్లు, కళ్యాణ్ నుంచి మహిళా ఉద్యోగికి 1311 ఔట్ గోయింగ్ కాల్స్ ఉన్నట్లు వెల్లడైంది. రామరాజు డ్రైవర్ నుంచి 161 సీఆర్పీసీ కింద ఏసీబీ వాంగ్మూలం సేకరించింది. ఈ క్రమంలో రామరాజు తరచూ కళ్యాణ్ కుమార్‌ను కలిసేవాడని తేలింది. అలాంటి సమయాల్లో రామరాజు నగదు రూపంలో కళ్యాణ్‌కు డబ్బు ముట్టజెప్పేవాడని గుర్తించారు. రామరాజుతోపాటు ఇదే కేసులో ప్రధాన నిందితుడు మొహిదుద్దీన్ లాంటి మరికొందరు దళారులు బృందంగా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల యూనిట్లను సరఫరా చేసినట్లు గుర్తించారు. ఇలాంటి వారితోనే కళ్యాణ్ దందా నడిపించినట్లు అధికారులు గుర్తించారు. ఈ బృందం క్షేత్ర, జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులతోపాటు కీలక ప్రజాప్రతినిధులకు స్థాయిలవారీగా లంచాలు ముట్టజెప్పినట్లు వెల్లడైంది. ఒక్కో యూనిట్‌కు 2 వేల రూపాయల చొప్పున కళ్యాణ్ సహా మరికొందరు లబ్ది పొందినట్లు తేలింది.

## జూల్1 నుంచి మారనున్న సిమ్ కార్డ్ రూల్స్.. ఇకపై ఆ ఆటలు సాగవు

ఢిల్లీ, జూన్ 27 (ప్రజాస్వరం) :


వినయోగదారుల భద్రతను పెంచుతూ జూల్ 1వ తేదీ నుంచి సిమ్ కార్డులకు సంబంధించి నియమాలను మార్చనున్నారు. ఇందులో భాగంగానే మొబైల్ నంబర్ పోర్టబిలిటీకి సంబంధించి నిబంధనను మార్చాలని నిర్ణయించారు. సిమ్ స్వాప్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రాయ్ తెలిపింది. కొత్తగా తీసుకొస్తున్న ఈ నిబంధనల ప్రకారం.. మారిన టెక్నాలజీతో పాటు నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ఎన్ని రకాల చర్యలు తీసుకున్నా సైబర్ మోసాలు మాత్రం తగ్గడం లేదు. ఇలాంటి మోసాల్లో సిమ్ కార్డులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. సిమ్ స్వాప్ పేరుతో ఇటీవల మోసాలు ఎక్కువుతున్నాయి. మన ప్రమేయం లేకుండానే మన పేరు మీద ఇంకొకరు సిమ్ కార్డును తీసుకోవడమే సిమ్ స్వాపింగ్. అయితే ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేయడాకి టెలికం సంస్థ ట్రాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. వినయోగదారుల భద్రతను పెంచుతూ జూల్ 1వ తేదీ నుంచి సిమ్ కార్డులకు సంబంధించి నియమాలను మార్చనున్నారు. ఇందులో భాగంగానే మొబైల్ నంబర్ పోర్టబిలిటీకి సంబంధించి నిబంధనను మార్చాలని నిర్ణయించారు. సిమ్ స్వాప్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రాయ్ తెలిపింది. కొత్తగా తీసుకొస్తున్న ఈ నిబంధనల ప్రకారం.. ఒకవేళ మీరు సిమ్‌కార్డును కోల్పోయినా, పాడైపోయినా వెంటనే సిమ్ తీసుకోవడానికి వీలుపడదు. ప్రస్తుతం సిమ్ కార్డ్ కోల్పోతే వెంటనే స్టోర్ నుంచి కొత్త సిమ్ తీసుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు కొత్త సిమ్ కార్డ్‌ను తీసుకోవడానికి కనీసం 7 రోజులు పాటు వేచి చూడాల్సిందే. ఏడు రోజుల లాకింగ్ వ్యవధి అమలు చేయనున్నారు. ఒక సిమ్ కార్డు కోల్పోతే అదే నెంబర్‌తో మరో సిమ్ కార్డ్ యాక్టివేట్ చేసుకోవాలంటే కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే. దీంతో ఒకవేళ మన ప్రమేయం లేకుండా మన సిమ్ కార్డును ఎవరైనా స్విమ్ స్వాపింగ్ చేస్తే తెలిసిపోతుంది. మీ ప్రమేయం లేకుండా ఏడు రోజుల పాటు సిమ్ డీ యాక్టివేట్‌లో ఉంటే, కచ్చితంగా మీ సిమ్ కార్డు విషయంలో అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది. దీంతో నేరాలు తగ్గుతాయి. ఇదిలా ఉంటే సిమ్ స్వాపింగ్ ద్వారా నేరస్థులు మీ నెంబర్ పై కొత్త సిమ్ ను యాక్టివేట్ చేసుకుంటారు. దీంతో మీ ఓటీపీలను సులభంగా యాక్సెస్ చేసి మీ ఖాతాల్లోని డబ్బును సులభంగా కాజేస్తున్నారు.

# వర్కౌట్ అయిన సోషల్ ఇంజనీరింగ్

కాకినాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ సోషల్ ఇంజనీరింగ్ మంచి ఫలితాలను ఇచ్చింది. మంత్రి వర్గ విస్తరణలో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన శెట్టిబలిజ కులానికి చెందిన వాసంశెట్టి సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. అమలాపురంకు చెందిన ఈయన అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి గెలుపొందారు.. తొలి సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. ఆయన టీడీపీకి దూరమైన శెట్టిబలిజల్ని దగ్గరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. బీసీ ఉపకులాల్లో ఒకరైన శెట్టిబలిజ కులస్తులు టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీ వెంట నడిచిన వారే. అయితే మెల్లగా మారిపోయారు. గత 20 ఏళ్లుగా వీరిలో ఎక్కువ శాతం మంది అప్పట్లో కాంగ్రెస్ వెంట నడిచారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పడ్డ వైఎస్సార్ సీపీ వెంట నడిచారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత వీరాభిమానులు శెట్టిబలిజ వర్గంలోని పెద్దలు చాలా మంది ఉన్నారని చెబుతారు.. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటే ఎక్కువ శాతం మంది నడిచారు..ఉభయగోదావరి జిల్లాలో ఎక్కువగా ఉన్న శెట్టిబలిజ కులాన్ని ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వంలో కూడా పెద్దపీట వేసిన పరిస్థితి ఉంది.. ఈ క్రమంలోనే రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తొలిసారి గెలిచిన చెల్లుబోయిన గోపాలకృష్ణకు మంత్రి పదవిని కట్టబెట్టింది. ఆ తరువాత ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో అమలాపురంకు చెందిన శెట్టిబలిజ కుల నాయకుడు కుడిపూడి సూర్యనారాయణరావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా శెట్టిబలిజ కులంలో కులం పేరు చెప్పి కొంత మందే పదవులు పొందుతున్నారు కానీ దిగువ క్యాడర్‌కు అన్యాయమే చేసిందని అసంతృప్తి వ్యక్తమయింది. దీనికి తోడు బీసీలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్న వాదన బలంగా వినిపించడంతో అనూహ్యంగా శెట్టిబలిజ కులస్తులు కూడా క్రమక్రమంగా పార్టీకు దూరమవుతూ కనిపించింది. ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధికంగా ఉన్న కాపులు, శెట్టిబలిజలు ఒక్కటవ్వాలన్న నినాదం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చాలా సారు వారాహి సభల వేదికగా అనేక సార్లు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడ్డాక ఈ నినాదంకు మరింత బలం చేకూరింది.. వైసీపీపై తీవ్ర అసంతృప్తిలో ఉన్న చాలా మంది శెట్టిబలిజ ద్వితీయశ్రేణి నాయకత్వం టీడీపీలోకి చేరింది.. ఈ మార్పే 2024 ఎన్నికల్లో కాపులు, శెట్టిబలిజలు ఏకమై కూటమి గెలుపులో కీలకంగా పనిచేసిన పరిస్థితి కనిపించింది...అమలాపురం అల్లర్లులో కేసుల్లో ఇరుక్కున వారు ఎక్కువ మంది కాపులు, శెట్టిబలిజలు కావడంతో వీరు ఆసంఘటన నుంచి కలిసే ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ తరువాత ఈ కేసుల్లో కొందరు అమాయకులు బలి అయ్యారని నష్ట నివారణ చర్యలు చేపట్టిన వైసీపీకు తిరిగి ఆ నష్టం మాత్రం పూడ్చలేని పరిస్థితి ఏర్పడింది.. శెట్టిబలిజ యూత్ ఫోర్స్ కన్వీనర్‌గా ఉన్న ప్రస్తుత కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, కాపు నాయకుడు గంధం పళ్లంరాజులు మధ్య ముందు నుంచి ఉన్న స్నేహం ఈ రెండు వర్గాలను కలపడంలో ప్రధాన భూమిక పోషించిందని చెప్పాలి. రామచంద్రాపురంలో స్థానికుడు కాకపోయినా కూటమి తరపున బరిలో దిగిన వాసంశెట్టి సుభాష్‌ను ప్రధానంగా కాపు, శెట్టిబలిజ సామాజికవర్గాల కలయిక మంచి మెజార్టీతో గెలుపొందేలా చేసింది.. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ జయహో బీసీ సదస్సులు పేరిట నిర్వహించిన కార్యక్రమంలో శెట్టిబలిజ వర్గాలకు పెద్దపీట వేయడంతో మరింత జోష్ పెరిగి టీడీపీ వైపు మళ్లేలా చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు.. ఈ జోష్ కూటమి గెలుపుకు మరింత బలాన్ని చేకూర్చిందంటున్నారు.. ఈ ఎన్నికల్లో కూటమి భారీ విజయంలో కాపు, కమ్మ సామాజికవర్గాల కాంబినేషన్ ఎంతటి సక్సెస్‌ను ఇచ్చిందో ఉభయగోదావరి జిల్లాల్లో కాపు, శెట్టిబలిజ కాంబినేషన్ కూడా అంతే సూపర్ హిట్ అయ్యిందని విశ్లేషకులు చెబుతున్నమాట. బలమైన సామాజికవర్గంలో ఒకట్కైన శెట్టిబలిజ వర్గంలో అత్యధికశాతం టీడీపీ వైపుకు మళ్లడం మాత్రం వైసీపీకు చాలా నష్టాన్నే మూటగట్టిందని మాత్రం స్పష్టం అవుతుందంటున్నారు..

# ట్విట్టర్ వార్...



విజయవాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్టు ఉంది వైసీపీ తీరు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు లేకుండా కట్టిన పార్టీ ఆఫీసులకి, అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆపీసుకు తేడాలేదా అంటూ నెటిజన్స్ మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి నారా లోకేష్ పై వైసీపీ కీలక నేత, మాజీమంత్రి పేర్ని నాని ట్విట్టర్ వేదికగా స్పందించారు.'నారా లోకేష్ నువ్వు పిల్లాడిగా ఉన్నప్పుడు మీ నాన్న హైదారాబాద్ లో కట్టించిన పార్టీ ఆఫీస్ ఏంటి ఇది పూరిపాక, రేకుల షెడ్డా లేదంటే ఒకే గది ఉన్న స్లాబా.. దీని చరిత్ర ఏంటి? ఈ పార్టీ ఆఫీస్ స్థలాన్ని ట్రస్ట్ కి బదిలీ చేసుకున్నారు రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారు.. 2019 ఎన్నికలకు వెళ్ళే నెల ముందు జనవరిలో కూడా 3 ఆఫీసులకి స్థలం లీజుకి తీసుకున్నారు.' అంటూ టీడీపీ ఆపీస్ ఫోటో షేర్ చేశారు.పేర్ని నాని ట్వీట్‌కు టీడీపీ ఘాటుగా స్పంధించింది. 'వైఎస్ జగన్ నువ్వు పదో తరగతిలో లాగులు వేసుకునే టైంలో, ప్రశ్నాపత్రాలు దొంగతనం చేసి దొరికిపోయావు. నీ స్నేహితులు చక్కగా చదువుకుని బాగుపడ్డారు. నువ్వు మాత్రం ఘరానా దొంగవి అయ్యావు. నీకు, నీ స్నేహితులకు ఎంత తేడా ఉందో, మేము అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆఫీసుకు, నువ్వు అనుమతులు లేకుండా, అక్రమంగా, కబ్జా చేసి, ప్రజల డబ్బుతో, 26 జిల్లాల్లో కట్టిన 26 ప్యాలెస్‌లకు అంత తేడా ఉంది.' అంటూ టీడీపీ మండిపడింది. కాగా ఈ పోస్టులు చూసిన నెటిజన్స్ వైసీపీపై మండిపడుతున్నారు.పేర్ని నాని పోస్టుపై నెటిజన్స్ మండిపడుతున్నారు. టీడీపీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఇప్పుడు గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతలు, అధినేత అధికారంలో ఉండగా ఎందుకు నోరు మెదపలేదు..? అనుమతులతో కట్టిన, ప్రజలకు ఉపయోగకరమైన ప్రజా వేదికను కూల్చినప్పుడు, అనుమతులు లేని పార్టీ ఆపీసుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ప్రశ్నిస్తున్నారు. అలానే నాడు మాట్లాడకుండా మౌనంగా ఉన్న మీరు నేడు మాట్లాడుతున్నారంటే.. టీడీపీపై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తమకు అర్థం అవుతుందని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబుపై బురదజల్లేందుకు మీరు చేస్తున్న ప్రయత్నం వర్థ్యం అని వైసీపీని ప్రజలు నమ్మడంలేదని నెటిజన్స్ తేల్చి చెప్పారు.

# స్వరూపుడి లీలలు...ఇంతింతకాదయా

విశాఖపట్టణం, జూన్ 27 (ప్రజాస్వరం) :

హిందూ ధర్మ రక్షణ, ధర్మ ప్రచారం, వేద విద్య.. ఇవీ అధ్యాత్మిక పీఠాల కర్తవ్యం.. శారదా పీఠం కూడా ఇందుకు అతీతం కాదు.. కానీ ప్రస్తుతం ఈ పీఠం పెద్దల్లో అధ్యాత్మిక భావన కంటే వాణిజ్యకోణాలే ఎక్కువ కనిపిస్తున్నాయన్న ఆరోపణలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ పెద్దలను అడ్డుగా పెట్టుకొని దేవుడి పేరు చెప్పుకొని అక్రమార్జన చేశారన్న ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇంతకీ ఏంటీ శారదపీఠం కథ.. ? వారిపై వస్తున్న ఆరోపణలేంటి?స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి.. విశాఖ శారదాపీఠం అధిపతి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన స్వామిజీ.. స్వరూపానందేంద్ర.. అయితే ఆ సమయంలో ఎంత పేరు వచ్చిందో.. ఇప్పుడు అంతకంటే ఎక్కువ వివాదాలను ఎదుర్కొంటున్నారు. కారణం ఆ పీఠం దక్కించుకున్న భూములు.. వారికున్న పొలిటికల్ లింక్స్.. ఇంతకీ వివాదం ఏంటంటే.. వైసీపీ హయాంలో శారదా పీఠానికి ప్రభుత్వం భారీగా భూములు కేటాయించింది. విశాఖలో వేద పాఠశాల ఏర్పాటు కోసం శారదాపీఠం భూమిని కోరింది. కోరింది స్వరూపానందేంద్ర.. అధికారంలో ఉంది శిష్యుడు జగన్.. ఇంకేముంది ఎకరం మూడు కోట్లు విలువ చేసే భూమిని కేవలం లక్ష రూపాయల చొప్పున 15 ఎకరాల భూమిని కేటాయించింది. అంటే 45 కోట్ల విలువైన భూమిని.. 15 లక్షలకు కేటాయించింది. భీమిలి బీచ్‌కి సమీపంలోని సర్వే నెంబరు 102,103లో ఈ 15 ఎకరాల భూమి ఉంది.ఇక్కడి వరకు బాగానే ఉంది. స్వామి స్వరూపానంద సరస్వతికి మేలు చేయడం కోసం 15 ఎకరాల భూమికి సమీపంలో %ఎవీ=ణూ%కు 50 ఎకరాలు కేటాయించింది ప్రభుత్వం.. ఆ 50 ఎకరాల భూమి అభివృద్ధి పేరుతో శారదాపీఠానికి కేటాయించిన భూమికి సమీపంగా రోడ్లు డెవలప్ కూడా చేశారు. అంటే ఇన్‌డైరెక్ట్‌గా %ఎవీ=ణూ% నిధులతో శారదాపీఠం స్వామివారికి ప్రత్యేక రోడ్లు.. మౌలిక వసతులు కల్పించింది జగన్ ప్రభుత్వం. మరి ఈ కేటాయింపులు అక్కడితో ఆగిపోయాయా? లేదు.. భీమిలిలో సముద్ర సమీపంలో ఒకచోట..అమరావతిలో యాగం చేసిన ప్రదేశానికి సమీపంలో మరోచోట.. ప్రకాశం జిల్లాలో ఇంకోచోట.. తిరుపతి, తిరుమలలో రెండు చోట్ల భూములను కేటాయించింది జగన్ ప్రభుత్వం. సో మొత్తంగా చూసుకుంటే వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకుంది శారదాపీఠం.ఇక తిరుమల విషయానికి వద్దాం.. తిరుమలలో ధర్మ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడుతుంది శారదాపీఠం.. అయితే ఈ నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తుందన్నది ఆరోపణలు. వడ్డించేవాడు మనవాడైతే.. పంక్తిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదన్నట్టుగా.. ఇన్నాళ్లు ఈ అక్రమాలను చూసి కూడా చూడనట్టుగా వదిలేసింది తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పెద్దలు.. ఏ బ్లాక్‌లో నిర్మాణాలకు పర్మిషన్ తీసుకున్నది నాలుగు అంతస్తులకు నిర్మించింది ఐదు అంతస్థులు. ఇదే విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు తిరుమల క్షేత్ర రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్.. హైకోర్టు పిటిషన్‌పై విచారణ చేసి కమిషన్ ఏర్పాటు చేయడం.. ఆ కమిషన్ విచారణ చేపట్టడం.. ఆ విచారణలో అక్రమాలు బయటపడటం.. ఇలా వరుసగా జరిగిపోయాయి. అసలు ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండానే నిర్మించడం ఓ తప్పైతే.. ఊట కాలువను పూడ్చించి మఠము వెనుక రహాదారి వైపు నిర్మించడం మరో తప్పు.. ఇదీ తిరుమల కథ.విశాఖలో గత ప్రభుత్వంలో ఇచ్చిన విలువైన భూములను కొత్త ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కోట్ల విలువైన భూములను స్వామిజీకి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. అయితే.. ప్రభుత్వం ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలి.. అదే మా డిమాండ్ అంటూ క్లియర్ కట్‌గా చెప్తున్నారు. అసలు శారదపీఠం ఆస్తులు ఈ ఐదేళ్లలో ఎందుకు గణనీయంగా పెరిగాయి? ఎలా పెరిగాయి? దీని వెనకున్నది ఎవరు? అనేది తేల్చాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది. మొత్తంగా చూసుకుంటే శారదాపీఠం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. మరి ప్రభుత్వం వీటిపై ఫోకస్ చేస్తుందా? త్వరలోనే విచారణ జరిపి.. ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంటుందా? ఈ ప్రశ్నలకు సమాధానం త్వరలోనే రానుంది.

## శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితుల ఆందోళన

నల్గోండ, జూన్ 27 (ప్రజాస్వరం) :

నల్లగొండ జిల్లా, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని.. శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు బాధితులు మరోసారి ఆందోళన బాట పట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా.. ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం కి భూనిర్వాసితులకు కొందరికి నష్టపరిహారం ఇవ్వకుండానే ఊరికి వెళ్లే దారిని తెంచేసి రాకపోకలకు బంద్ చేశారు. కాంట్రాక్టర్లు, అధికారుల తీరుకు నిరసిస్తూ.. ప్రభుత్వ పనితీరును తప్పు పడుతూ.. ప్రాజెక్టు పనులను అడ్డగించారు బాధితులు. ఈ క్రమంలో.. పోలీసుల సమక్షంలో ప్రాజెక్టు %ణజు% కాశీం వచ్చి.. వచ్చే వారం రోజుల పాటు రాకపోకలకు అంతరాయం కలగకుండా రోడ్డును తవ్వమని హామి ఇవ్వటంతో గ్రామస్తులు శాంతించారు. అయితే.. బాధిత నర్సిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే రొడ్డును తవ్వేశారు. అధికారులు స్వయంగా హామీ ఇచ్చారని.. మళ్ళీ యధావిధిగా పనులు చేసి తమ గ్రామంలోకి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

# జగన్ పై సెటైర్లు..

విజయవాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

ఎక్కువ ఎంపి స్థానాలు ఇవ్వండి. కేంద్రం మెడలు వంచి ఈ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తీసుకొస్తాను. ఏపీ రూపురేఖలే మార్చేస్తాను.. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ తరచూ చేసిన ప్రకటన ఇది. ప్రజలు 22 మంది ఎంపీలను ఇచ్చారు. అయినా కేంద్రం మెడలు వంచలేదు. తిరిగి వంగి వంగి దండాలు పెడుతూ వారికే మద్దతు ఇచ్చారు జగన్. పార్లమెంట్ లోని రెండు సభల్లో సైతం.. ఈ సందర్భంలోనైనా బిజెపికి జై కొట్టారు. నిర్ణయాలు, బిల్లులు, జాతీయ అంశాలు.. ఇలా ఒకటేంటి అన్నింటికీ తమ మద్దతును తెలియజేశారు. కానీ గత ఐదు సంవత్సరాలలో కేంద్రానికి తన అవసరం వచ్చినప్పుడు ప్రత్యేక హెూదా మెలిక పెట్టలేదు జగన్.ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకుంది తెలుగుదేశం పార్టీ. మూడు పార్టీలు కలిసి వెళ్లాయి. ఘనవిజయం సాధించాయి. కానీ గత ఐదేళ్లుగా ప్రత్యేక హెూదా తెస్తానని చెప్పిన జగన్ ఎన్నడూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదు. తన అవసరం వచ్చినప్పుడు షరతులు విధించలేదు. కానీ ఇప్పుడు టిడిపి మెజారిటీ ఎంపీ స్థానాలు గెలిచేసరికి.. ప్రత్యేక హెూదా తేవాలంటూ సెటైర్లు వేయడం మాత్రం కొంచెం అతిగా ఉంది. తాను చేయలేని పనిని.. మీరైనా చేయండి అని చెబితే బాగుండేది. కానీ తన అసమర్ధతను కప్పిపుచ్చుకొని.. టిడిపి పై ప్రత్యేక హెూదా బురద చల్లేందుకు జగన్ వేసిన ఎత్తుగడగా తెలుస్తోంది.కేంద్ర పెద్దలు వైసీపీని ఆశ్రయించారు. తాము నిలబెడుతున్న స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. పెద్దలు అడిగింది తడవుగా ఓకే చెప్పారు జగన్. తమ మద్దతు ఎప్పుడూ ఎన్డీఏకు ఉంటుందని ఏకంగా లిఖితపూర్వకంగా కూడా తెలియజేశారు. మరి ఇప్పుడు ప్రత్యేక హెూదా ఇవ్వాలని కోరారా? ఆ షరతుతోనే మద్దతు తెలిపారా? అని టిడిపి సెటైర్లు వేయడం ప్రారంభించింది. ఎన్డీఏ పూర్తి మెజారిటీ ఉంది. 290 మంది ఎంపీలతో మ్యాజిక్ ఫిగర్ కు దాటింది. కానీ అది మిత్రుల మద్దతుతో. అందులో 16 మంది సభ్యులతో టిడిపి కీలకంగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే బిజెపి తర్వాత పెద్ద పార్టీ టిడిపి. కానీ బేషరతుగా వైసీపీ మద్దతు ప్రకటించింది. మొన్నటికి మొన్న ఎన్డీఏలో టిడిపి చేరితే ప్రత్యేక హెూదా అడగొచ్చు కదా అని వైసిపి సూచించింది. ఇప్పుడు అదే వైసిపి బిజెపి స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో ప్రత్యేక హెూదా గురించే కదా.. అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. ఇలా రెండు పక్షాలకు ప్రత్యేక హెూదా ప్రధాన ఇష్యూ కావడం గమనార్హం.

టీడీపీ అలెర్ట్...

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజా ఎన్నికల్లో జగన్ పై ఎన్డీఏ కూటమి విజయం సాధించింది. ఇప్పుడు అదే ఎన్డీఏ కు జగన్ మద్దతు తెలిపారు. ఎన్డీఏ లో కీలక భాగస్వాములుగా



చంద్రబాబుతో పాటు పవన్ ఉన్నారు. స్పీకర్ ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉన్నా.. బిజెపి మాత్రం వైసీపీ మద్దతు కోరింది. వెంటనే జగన్ సైతం ఓకే చెప్పారు. అసలు ఏపీ విషయంలో మోదీ వ్యూహం ఏంటన్నది తెలియడం లేదు. మూడు ప్రాంతీయ పార్టీలను తన చెప్పు చేతుల్లోకి తీసుకోవడం ఆసక్తికర పరిణామంగా మారింది. ఏపీలో వైసీపీకి నలుగురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. వారు స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీఏ నిలిపిన అభ్యర్థికి ఓటు వేయనున్నారు. ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉంది. 293 మంది సభ్యుల బలం ఉంది. కానీ బిజెపి నాయకత్వం మాత్రం నలుగురు సభ్యులు ఉన్న వైసీపీ మద్దతును కోరింది. 2019 నుంచి ఐదేళ్ల పాటు జగన్ కేంద్రం విషయంలో ఎలా నడుచుకున్నది అందరికీ తెలిసిన విషయమే. కేంద్రానికి అవసరమైన ప్రతిసారి జగన్ మద్దతు తెలుపుతూ వచ్చారు. ఎన్డీఏలో టిడిపి, జనసేన ఉండడంతో స్పీకర్ ఎన్నికల్లో వైసిపి ఎలా వ్యవహరిస్తుంది అన్నది చర్చగా మారింది. కానీ బిజెపి నుంచి మద్దతు కావాలని ప్రతిపాదన రావడం.. దానికి జగన్ ఓకే చెప్పేయడం జరిగిపోయింది. లోక్సభలో వైసిపి పార్లమెంటరీ నేత మిథున్ రెడ్డితో బిజెపి నేతలు చర్చించారు. వెంటనే ఆయన జగన్ తో చర్చలు జరిపారు. ఎన్డీఏకు మద్దతు ఉంటుందని ప్రకటన కూడా వచ్చింది.ఎన్డీఏకు సంపూర్ణ మెజారిటీ ఉండగా.. వైసీపీ మద్దతు కోరడం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. అసలు ఏపీ విషయంలో మోడీ ఏం ఆలోచిస్తున్నారన్న ప్రశ్న వినిపిస్తోంది. ఎన్డీఏలో భాగస్వాములుగా ఉండగా.. బిజెపి వైసిపి మద్దతు కోరడంపై టిడిపి, జనసేనలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొన్నటికి మొన్న ప్రమాణ స్వీకార మహెూత్సవంలో చిరంజీవి, పవన్ ను తీసుకొని వచ్చి మరి ప్రధాని మోదీ అభివాదం చేయించారు. ఇప్పుడు మొన్నటి ఎన్నికల్లో ఎవరిపై పోరాడారో.. అదే జగన్ ను ఇప్పుడు మద్దతు కోరారు. దీని వెనుక వ్యూహం ఏదైనా ఉందా అన్న అనుమానాలు టిడిపిలో ఉన్నాయి. అయితే దీనిపై చంద్రబాబు అలెర్ట్ అయినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ సుస్థిరతను దెబ్బతీయాలని ఆలోచన చేస్తున్న ఇండియా కూటమికి అవకాశం ఇవ్వకూడదని మోడీ భావిస్తున్నారు. అందుకే సభలో తమ బలాన్ని చూపే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబుతో పాటు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను సంప్రదించిన తర్వాతే.. ప్రధాని మోదీ వైసిపి మద్దతు కోరినట్లు తెలుస్తోంది.

## ఉచిత రవాణా హామీపై చంద్రబాబు సర్కార్ దృష్టి



విజయవాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

ఏపీలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. సూపర్ సిక్స్ లోని మహిళలకు ఉచిత రవాణా హామీ పై చంద్రబాబు సర్కార్ దృష్టి సారించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కుప్పం ఆర్టీసీ బస్టాండు, డిపో ఆధునీకరణ పనులకు ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుప్పంలో ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో పరిస్థితిని అధ్యయనం చేస్తామన్నారు.లోటుపాట్లను గుర్తించి ఏపీలో పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. వైసీపీ నేతలు ఆర్టీసీ స్థలాలు దోచుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరుగుతోందన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూస్తామన్నారు. కుప్పం బస్టాండ్, డిపో ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 5 కొత్త బస్సులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు రావడంతో సుమారు 30 బస్సులు కుప్పం డిపోకు వచ్చాయన్నారు.గత ప్రభుత్వం ఏ శాఖను వదల్లేదని విమర్శించారు మంత్రి రాంప్రసాద్. 5 ఏళ్లలో ఎన్ని వీలైతే అన్ని విద్యుత్ బస్సులు తీసుకొస్తామన్న మంత్రి ప్రభుత్వంలో ఏపీఎస్ ఆర్టీసీని 100 శాతం విలీనం చేసేందుకు కృషి చేస్తామన్నారు. డిజల్ రేట్స్ తగ్గినా బస్సు చార్జీలను పెంచిన ఘనత గత ప్రభుత్వానిది అంటూ విమర్శించారు. జగన్ మాటలను ప్రజలు వినే పరిస్థితి లేదని అన్నారు. రాజకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సుకు ఫ్రీగా వాడమన్నారు మంత్రి రాంప్రసాద్.

## రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న మంత్రి వాసంశెట్టి



కోనసీమ, జూన్ 27 (ప్రజాస్వరం) :

రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం సెంటర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన దంపతులను సరిగ్గా అదే సమయానికి అటువైపు వెళుతున్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తమ కాన్వాయ్ ను ఆపి వారిని తమ కారులో రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ కి హుటాహుటిన తరలించారు. క్షతగాత్రులకు తక్షణమే తగిన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

# అమరావతిపై అందరి కళ్లు

విజయవాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో పెట్టేందుకు సైబరాబాద్‌కు తానే అంకురార్పణ చేశానని.. అభివృద్ధిని చేశానని చంద్రబాబు గర్వంగా చెప్పుకుంటారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రజలకు తనకు మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే అవకాశం ఇచ్చారని .. దాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పేవారు. అందుకే సెక్రటేరియట్, అసెంబ్లీ, ఉద్యోగుల క్వార్టర్స్, రాజ్ భవన్ వంటివి కట్టి అదే రాజధాని అనిపించుకునే అవకాశం ఉన్నా.. రాజధానిని ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మార్చాలన్న పట్టుదలతో అమరావతికి రూపకల్పన చేశారు. చంద్రబాబు ఈ సిటీ కోసం అంతర్జాతీయ నిపుణులతో సంప్రదింపులు జరిపి పక్కా ప్రణాళికలు రెడీ చేసుకున్నారు. ఎప్పుడెప్పుడు ఎంతెంత ఖర్చు పెట్టాలి.. ఎలా నిధుల సమీకరణ చేయాలన్న అంశాలపై ఓ బ్లూ ప్రింట్ రెడీ చేసుకున్నారు. ఈ మేరకు అమరావతి ఫైనాన్షియల్ ప్లాన్ గురించి ఫిబ్రవరి 2019లో టీడీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 50ను విడుదల చేసింది. ఈ ప్లాన్ ప్రకారం%ా% అమరావతి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 55,343 కోట్లు. ఇందులో 8 ఏళ్లలో ఖర్చు పెట్టాల్సింది కేవలం 6629 కోట్లు . రాజధానిని ప్రభుత్వం మొదటి నుంచి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ గా చెబుతూ వస్తోంది. భూములకు మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత.. వాటి విలువ పెరుగుతోంది. అప్పుడు .. ప్రభుత్వానికి మిగిలే భూమితో సంపాదించుకునే ప్రణాళికలను ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకే పెద్దగా పెట్టుబడి ఉండాల్సిన అవసరం లేదనుంది. అమరావతిలో ఆర్థిక నిపుణలు ఓ గొప్ప ఆర్థిక నమూనాను చూశారు. పట్టణీకరణకు ఓ అద్భుతమైన దిక్సూచీగా మారబోతోందని అంచనా వేశారు. 33వేల ఎకరాలు సమీకరించిన విధానం.. ఆ ప్రాజెక్ట్ పై దేశవ్యాప్తంగా విశ్వాసం పెరగడానికి కారణం అయింది. ఆ ప్రాజెక్ట్‌కు ఎంత క్రేజ్ వచ్చిందంటే రూ. రెండు వేల కోట్ల రుణం కోసం..సీఆర్డీఏ బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్ట్ అయితే ఆ మొత్తం నిమిషాల్లోనే వచ్చింది. సాధారణంగా ప్రభుత్వాలకు చెందిన వాటిలో పెట్టుబడులు పెట్టడానికి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపరు. గతంలో పలు నగరాలు.. అలాంటి ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేదు. అమరావతి మోడల్ సక్సెస్ అయితే పట్టణీకరణలో కొత్త చరిత్ర ప్రారంభమవుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే వరల్డ్ క్లాస్ సిటీ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ద్వారా పూర్తి కావడం అంటే ఓ గొప్ప సక్సెస్ మోడల్ దొరికినట్లే. అమరావతిపై జగన్ ప్రభుత్వ విధానం అందుకే విమర్శల పాలైంది. ప్రఖ్యాత ఆర్థికవేత్తలు.. బిజినెస్ మీడియాకూడా.. తప్పు పట్టింది. మొదటి బడ్జెట్‌లో అమరావతికి కేవలం ఐదు వందల కోట్లు



మాత్రమే ఇచ్చిన వైనం.. ఆ తర్వాత సింగపూర్ తో ఒప్పందం రద్దు చేసుకోవడం వంటి అంశాలపై.. బిజినెస్ నిపుణులు తీవ్రంగా స్పందించారు. మోహన్ దాస్ పాయ్ లాంటి పారిశ్రామికవేత్తలు.. శేఖర్ గుప్తా లాంటి జర్నలిజం దిగ్గజాలు కూడా..అమరావతిపై జగన్ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. కానీ జగన్ తాను అనుకున్నదే చేశారు. ఫలితంగా ఐదేళ్లు ప్రాజెక్టు మూలనపడింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో మరోసారి ఆశలు చిగురించాయి. 2015 అక్టోబర్ 24 నాడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్సిట్ సచివాలయం, అసెంబ్లీ భవనం, హైకోర్టు నిర్మాణాలు పూర్తయ్యాయి. వినియోగంలోకి వచ్చాయి. డిజైన్ల విషయంలో జాప్యం జరగడంతో సీడ్ క్యాపిటల్ నిర్మాణంలో ఆలస్యమైంది. ఐఏఎస్ అధికారుల భవన సముదాయం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గృహ సముదాయం, ఎన్జీవోల హౌసింగ్ సహా పలు నిర్మాణాలు చివరి దశకు వచ్చాయి. తొలి దశ పనుల్లో మొత్తం 12,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ భవనాలు, గృహాల కోసం రూ. 5,883 కోట్లు, భూసమీకరణ కోసం రూ.12,545 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. ఎక్కడ ఆగిపోయాయో.. ఐదేళ్ల తర్వాత పనులు అక్కడే ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మళ్లీ అక్కడ్నుంచే ప్రారంభిస్తోంది. గతంలో మొదటి సారి చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడినప్పుడు అమరావతిని రాజధానిగా నిర్ణయించడం, భూమీకరణ, మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేయడం, జాతీయ హరిత ట్రిబ్యూనల్ లో కేసులు అన్నీ పరిష్కరించుకునే సరికి మూడేళ్లు గడిచిపోయాయి. ఈ సారి అలాంటి సమస్యలు లేవు. పునాదుల మీద నుంచి పనులు ప్రారంభించడమే. అందుకే గతంలో పనులు చేసిన కాంట్రాక్టు సంస్థలతో కాంట్రాక్ట్ తీరిపోయింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా కాంట్రాక్టులు చేసుకోవాలి. అందుకే ప్రభుత్వం నిర్మాణ సంస్థలతో మళ్లీ చర్చలు ప్రారంభించింది. జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. తొలి దశ రాజధాని పనుల్ని శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. దానికి తగ్గట్లుగాన్నే ఏర్పాట్లు చేసుకుంటోంది. చంద్రబాబు అమరావతిని రాత్రికి రాత్రి లేదా ఓ ఐదేళ్లకో.. పదేళ్లకో అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకోలేదు. ఓ క్రమబద్ధమైన అభివృద్ధితో.. సుదీర్ఘమైన ప్రణాళికే పెట్టుకున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, మండలాలలోని 29 గ్రామల పరిధిలో 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సీడ్ క్యాపిటల్ ఉంటుంది. అమరావతి మహానగరంలో అంతర్భాగంగా 9 నగరాలు నిర్మిస్తారు. రాజధాని అంటే కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, పరిశోధన, పర్యాటకం, ఆతిథ్యం, కళలు, సాంస్కృతిక, వాణిజ్య, సాంకేతిక కార్యకలాపాలకు ముఖ్య కేంద్రంగా నిలవాలన్నది సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. ఇవన్నీ వస్తే ఉపాధి అవకాశాలు వాటంతట అవే వస్తాయి. అమరావతి మహానగరంలో అంతర్భాగంగా 9 నగరాలుగా నిర్మించాలని నిర్ణయించారు. 1.ప్రభుత్వ పరిపాలన నగరం 2. న్యాయ నగరం 3. ఆర్థిక నగరం 4.విజ్ఞాన నగరం 5.ఎలక్ట్రానిక్స్ నగరం 6. ఆరోగ్య నగరం 7. ఆటల నగరం 8. మీడియా నగరం 9.పర్యాటక నగరం. దేశ,విదేశాలలో పలు నగరాలను చూసి, వాటి స్ఫూర్తితో ఈ విధంగా ప్రత్యేక నగరాలు నిర్మించాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చారు. విశాలమైన రోడ్లు, వాటిలో సైకిల్ ట్రాక్ లు, పచ్చదనం పరిచినట్లు పచ్చికబయళ్లు, పూల మొక్కలు, చల్లదనాన్ని ఇచ్చే చెట్లు, ఫౌంటెన్లు%ా%. ఇలా అందమైన ఓ సుందర నగరం ఏర్పడుతుంది. ఈ నగరాలను కలుపుతూ మెట్రో రైలు మార్గం నిర్మిస్తారు. విజయవాడ, గుంటూరుల నుంచే కాకుండా రాయలసీమ,ఉత్తరాంధ్ర నుంచి కూడా అమరావతికి అనుసంధానం చేస్తూ ఆరు లైన్ల రోడ్లు నిర్మిస్తారు. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తారు. కనీసం పాతికేళ్ల ప్రణాళిక ఇందులో ఉంది.వచ్చే ఐదేళ్లు అమరావతి నగరానికి అత్యంత కీలకం. పరిపాలనా నగరాన్ని రెండు, మూడేళ్లలో పూర్తి చేయడంతో పాటు తదుపరి దశకు పునాదులు వేయాల్సి ఉంటుంది. అదే సమయంలో అమరావతిని జీవించడానికి అనువుగా ఉండే నగరంగా మార్చాల్సి ఉంటుంది. అలా చేయాలంటే ఉపాధి అవకాశాల్ని మెరుగుపర్చాల్సి ఉంటుంది. అంటే.. ఆఫీసులన్నీ తరలి వచ్చేలా చూడాలి. ఇప్పటికే వందకుపైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలకు స్థలాలు కేటాయించారు. గతంలో ప్రముఖ విద్యా సంస్థలకు.. వ్యాపార సంస్థలకు స్థలాలు కేటాయించారు. వారందర్నీ ఒప్పించి నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చేయాల్సి ఉంది. చంద్రబాబుకు అతి పెద్ద సవాల్. వచ్చే ఐదేళ్లలో అమరావతి మొదటి దశను మాస్టర్ ప్లాన్‌లో చెప్పినట్లుగా రూపొందించడం. అదే చేయగలిగితే.. ఆయన తన రాజధాని స్వప్నానికి ఓ రూపం ఇచ్చుకున్నట్లే. ఏపీ రాజధానిగా అమరావతిని ఠీవీగా నిలబెట్టినట్లే.

# కేంద్రంపైనే పోలవరం ఆశలు

ఏలూరు, జూన్ 27 (ప్రజాస్వరం) :

పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి, ఇది దశాబ్దాల కల. క్లిష్టమైన డిజైన్ అంతకు మించి సవాళ్లతో కూడిన నిర్మాణం. అనుమతులు.. డిజైన్లు, నిధులు పేరుతో ఏళ్లకేళ్లు గడిచిపోతూనే ఉన్నాయి. అరవై ఏళ్లుగా ఈ ప్రాజెక్టు చర్చల్లోనే ఉంది. రాష్ట్ర విభజన పుణ్యమా అని ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చింది. 2014-19 మధ్య నిర్మాణం పరుగులు పెట్టినా..అత్యంత కీలకమైన సహాయ, పునరావాసంపై మాత్రం పీటముడి పడిపోయింది. జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చినా తాము డ్యామ్ నిర్మాణానికే నిధులిస్తామని సహాయ, పునరావాసం తమ బాధ్యత కాదని వాదించింది. తర్వాత అంచనాలను తగ్గించేసింది. ఇలాంటి సమస్యలతో వైసీపీ హయాంలో ఐదేళ్లు ఆగిపోవడంతో.. అనేక సమస్యలు వచ్చాయి. ఇప్పుడు వచ్చే మూడు, నాలుగు సీజన్లలో డ్యామ్ పూర్తి చేసినా... నీళ్లు నిలపాలంటే.. సహాయ, పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా చేయాలంటే కేంద్రం నుంచి సహకారం రావాల్సిందే. మరి కేంద్రం అందుకు సిద్ధంగా ఉందా ? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2013 సెక్షన్ 90(1) ప్రకారం పోలవరంకు జాతీయ హోదా వచ్చింది. సెక్షన్ 90(4) ప్రకారం, నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అని స్పష్టంగా పేర్కొన్నారు. కేంద్రం పర్యవేక్షణ చేస్తే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పడం కాబట్టి.. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్మిస్తే నిధులు రీఎంబర్స్ చేసేలా ఒప్పంద చేసుకున్నారు. మొదట్లో ట్రాన్స్ ట్రాయ్, ఆ తర్వాత నవయుగ కంపెనీల ఆధ్వర్యంలో పనులు జరిగాయి.జగన్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను మార్చి మిగిలిన పనులు మేఘ కంపెనీని అప్పగించింది. కానీ ఆ సంస్థ పనులు వేగంగా చేపట్టడంలో విఫలమయింది. అనేక సమస్యలు వచ్చాయి. పోలవరం ప్రధాన డ్యాం పనులు ఇప్పటికే 78 శాతం పనులు పూర్తి అయ్యాయి. అత్యంత కీలకమైన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్‌డ్యామ్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కొట్టుకుపోయి ప్రధాన డ్యామ్ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న డయా ఫ్రమ్ వాల్ నిర్మాణంపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది. డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయో తేల్చాలి. డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మించాలనే ప్రతిపాదన ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. గోదావరిలో మట్టి స్వభావం వల్ల నది మధ్యలో స్పిల్ వే నిర్మించే అవకాశం లేదు. దీంతో నది ప్రవాహమార్గాన్ని మార్చి, కొండలు ఉన్నచోట ఊళ్లన్నీ ఖాళీ చేయించి, అక్కడ స్పిల్ వే నిర్మించారు. గోదావరి మధ్యలో ప్రధాన డ్యాం నిర్మించాలి. ఆ కట్ట దిగువన డయాఫ్రం వాల్ విదేశీ సాంకేతిక



పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రధాన డ్యాం నిర్మించేందుకు వీలుగా ప్రవాహాన్ని మళ్లించేందుకు ఎగువన, దిగువన కాఫర్ డ్యాంలు నిర్మించారు. ప్రాజెక్టులోనే ప్రాజెక్టులోనే అత్యంత కీలక కట్టడం డయాఫ్రం వాల్. చంద్రబాబు హయాంలో విదేశీ కంపెనీ బావర్‌తో ఈ పనులు చేయించారు. నదీగర్భంలో 70 మీటర్ల లోతు నుంచి ఈ కట్ ఆఫ్ వాల్ నిర్మించాల్సి వచ్చింది. జగన్ హయాంలో ఈ నిర్మాణాన్ని వరదల నుంచి రక్షించలేకపోయారు. ఎగువ కాఫర్ డ్యాంలో ఉన్న గ్యాప్‌లను సకాలంలో పూడ్చకపోవడంతో 2020 వరదలకు ఈ డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. మళ్లీ డయాఫ్రం వాల్ నిర్మించుకోవాలి. ఇందుకు రెండు సీజన్ల సమయం పడుతుంది. ఆపైన మళ్లీ ప్రధాన డ్యాం నిర్మించాలి. అంటే ఎంత లేదన్నా ఐదేళ్లు పడుతుంది. పోలవరం సవరించిన అంచనాలను చంద్రబాబు హయాంలో రూ.55,656 కోట్లకు కేంద్ర జలసంఘం ఆమోదించింది. తర్వాత రివైజ్డ్ కాస్ట్‌కమిటీ రూ.47,725,74 కోట్లకు సిఫార్సు చేసింది. ఆ నిధులకు ఇంతవరకు కేంద్రం ఆమోదించలేదు. మరోవైపు జగన్ హయాంలో తొలిదశ నిధులు అంటూ 41.15 మీటర్ల స్థాయి పునరావాసాన్ని, భూసేకరణను పరిగణనలోకి తీసుకుని, కట్టడాల కాలువల విషయంలో యథాతథ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రూ.31,625 కోట్లకు కేంద్ర జలసంఘం సిఫార్సు చేసింది. ఆ నిధులతో పోలవరం పూర్తిచేయడం సాధ్యం కాదు. తమకు పరిహారం చెల్లించకుండానే బలవంతంగా ముంపు ప్రాంతాల నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు ఫిర్యాదుచేశారు. దీనిపై 15 రోజుల్లో సమాధానం చెప్పాలని సీఎస్‌ను తాజాగాఎస్టీ కమిషన్ ఆదేశించింది. ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో 196టీఎంసీలు నిల్వ చేయాలంటే 45.72 మీటర్ల కాంటూరు మేరకు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం 85,136 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. 53,192 ఎకరాల భూమి సేకరించి పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం రూ. ఏడు వేల కోట్లు వ్యయమవుతాయని అంచనా. ఈ మొత్తం మున్ముందు మరింత పెరిగే అవకాశాలూ ఉన్నాయి. నిర్వాసితులు కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరితే.. భూముల విలువ అమాంతం పెరిగిపోతోంది. పునరావాస గృహాల నిర్మాణానికి రూ.12,88 కోట్లు ఖర్చుచేయాలి. అంటే రాష్ట్రప్రభుత్వం రూ.26 వేల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. 41.15 మీటర్ల కాంటూరులో 115టీఎంసీల నిల్వకే పరిమితం చేయాలని గత ప్రభుత్వం అనుకుంది. కానీ అలా చేస్తే అది బహుళార్ధక సాధక ప్రాజెక్టుగా కాక..త సాదాసీదా ఎత్తిపోతలగా మిగిలిపోతుంది. పోలవరం వంటి ప్రాజెక్టు పూర్తయితే.. ఒక్క ఏపీకి మాత్రమే లాభం ఉండదు. దేశానికి అదో పెద్ద ఆస్తి అవుతుంది. నదుల అనుసంధాన మహా యజ్ఞంలో అతి పెద్ద ముందడుగు పడినట్లవుతుంది. అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు అవుతుందని కేంద్రమే అనేక సార్లు చెప్పింది. అందుకే ప్రాజెక్టు పూర్తయ్యేలా కేంద్రం సహకరిస్తుందని ఆశతో ఉన్నారు. లేకపోతే అంచనాలు పెరిగిపోతూ పోవడమే తప్ప.. దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఎప్పటికి వస్తాయో అంచనా వేయడం కష్టం.

## ఆలూ లేదు...చూలు లేదు...

### కాంగ్రెస్ లో ముఠాలు, గ్రూపులు



విజయవాడ, జూన్ 27 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్ ను సుదీర్ఘకాలంగా పాలించింది కాంగ్రెస్ పార్టీ. కానీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పరిస్థితి మారింది. టిడిపి హవా ముందు కాంగ్రెస్ నిలవలేకపోయింది. టిడిపి ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి రాగలిగింది. దేశంలోనే తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా నిలిచింది. అయితే అదే తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించింది కాంగ్రెస్ పార్టీ. కానీ రాష్ట్ర విభజన పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో సోది లేకుండా పోయింది. కనీసం ఉనికి చాటుకోలేకపోతోంది. ఈ ఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల ద్వారా బలపడాలని భావించింది. కానీ బలం పెంచుకోలేకపోయింది. వైసిపి పతనంతో బలపడాలనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు నీరుగారిపోయాయి. వైసిపి పతనం వరకు ఓకే కానీ.. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఉనికి మాత్రం చాటుకోలేకపోయింది.1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల కాలం లోనే ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. 1985లో నాదెండ్ల భాస్కరరావు రూపంలో కాంగ్రెస్ పార్టీ టిడిపిని నిలువరించే ప్రయత్నం చేసింది. కానీ నందమూరి తారక రామారావు ప్రజాభిప్రాయాన్ని కోరుతూ ఎన్నికలకు వెళ్లారు. అంతులేని ప్రజామోదంతో అధికారంలోకి రాగలిగారు. కానీ 1989 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి గురికాక తప్పలేదు. అయితే 1994 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ. 1995లో టిడిపిలో సంక్షోభం ఎదురైనా.. 1995 ఎన్నికల్లో చంద్రబాబు సర్కార్ విజయం సాధించింది. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. 2009 ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీకి చుక్కెదురు అయ్యింది.రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో వైసీపీ ఆవిర్భవించింది. కాంగ్రెస్ పార్టీ స్థానంలో ఉనికి చాటుకునే ప్రయత్నం చేసింది. 2014లో ప్రతిపక్షం స్థానానికి పరిమితమైన వైసీపీ.. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఐదేళ్లపాటు అధికారాన్ని చక్కబెట్టింది. కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి తొక్కింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నీడన ఉన్న రాజశేఖర్ రెడ్డి కుమార్తె కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధికార పార్టీగా ఉన్న వైసీపీకి ఎదురెళ్లి వెళ్లారు. సోదరుడు జగన్ నాయకత్వాన్ని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున బలమైన అభ్యర్థులను బరిలో దించడం ద్వారా వైసీపీని నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఆ పార్టీ సాధించిన ఓట్లు అంతంత మాత్రమే. మెజారిటీ సర్వేలు కాంగ్రెస్ పార్టీ ఒకటి రెండు సీట్లు సాధిస్తుందని చెప్పినా.. ఓట్లు, సీట్లు పరంగా ఆ పార్టీ సాధించినవి అంతంత మాత్రమే. 40% ఓట్లు సాధించిన వైసీపీతో సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీకి ఐదు శాతం మించి ఓట్లు రాలేదు. కానీ వైసీపీని గద్దెదించామన్న సంతోషంతో కాంగ్రెస్ పార్టీ గడిపేస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చేందుకు షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంతగానో దోహద పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆ పార్టీకి దక్కిన ఓట్లు మాత్రం అంతంత మాత్రమే. కేవలం వైసీపీ ఓటమితో తాము బలపడం అన్న ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉండడం విశేషం.

## నెల్లూరు సెంట్రల్ జైల్‌కి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

నెల్లూరు, జూన్ 27 (ప్రజాస్వరం) :

ఈవీఎంల ధ్వంసం కేసులో అరెస్టుయిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు.గురువారం ఉదయం 8.50 కి జైల్ లోకి తరలించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. నంబూరి శేషగిరి రావు పై దాడి, కారంపూడి సిఐ నారాయణ స్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లికి రిమాండ్ విధంచారు.పిన్నెల్లిని పోలీసులు మాచెర్ల నుంచి పిన్నెల్లిని ఉదయం నెల్లూరుకు తరలించారు ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా సెంట్రల్ జైల్ వద్ద భద్రత పెంచారు. బారికేడ్లని ఏర్పాటు చేసారు.

## ఆంధ్రప్రదేశ్ సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలం పొడిగింపు

అమరావతి, జూన్ 27 (ప్రజాస్వరం) :

ఆంధ్రప్రదేశ్ సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు డీవోపీటీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 వ తేదీ వరకు ఆయన సర్వీసును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జవహర్‌రెడ్డిని బదిలీ చేసి నీరభ్‌కుమార్‌ను సీఎస్‌గా నియమించారు. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. సీఎస్ కావడానికి ముందు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.1988లో పశ్చిమ గోదావరి జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన ప్రయాణాన్ని నీరభ్‌కుమార్ మొదలుపెట్టారు. 1990లో తూర్పు గోదావరి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. 1991లో ఏటూరు నాగారం పీవో ఐటీడీఏ, 1992లో కృష్ణా జిల్లా పీడీ ఆర్డీఏగా పనిచేశారు. 1993లో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 1996లో ఖమ్మం కలెక్టర్‌గా, 1998లో చిత్తూరు కలెక్టర్‌గా సేవలు అందించారు. 1999లో యువజన సంక్షేమశాఖ డైరెక్టర్, శాప్ ఎండీగా పనిచేశారు. 2000లో కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లారు.2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీగా, 2007లో పరిశ్రమల శాఖ కమిషనర్గా, 2009లో మత్స్యశాఖ కమిషనర్‌గా సేవలు అందించారు. 2012లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో జీఏడీ ముఖ్య కార్యదర్శిగా, 2015లో వైఏటీసీ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2017లో కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. 2018లో టీఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, 2019లో రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా కొనసాగుతున్నారు.

# యెస్ బ్యాంక్‌లో ఉద్యోగులపై వేటు..!




ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ భారీ పునర్వ్యవస్థీకరణలో తమ ఉద్యోగులపై వేటు వేసింది.దాదాపు 500 మందికి ఉద్వాసన పలికింది. తాజాగా ప్రకటించిన తొలగింపులతో పాటు రానున్న వారాల్లో మరిన్ని ఉద్యోగులకు కోత పెడుతుందని సమాచారం. వ్యయ నియంత్రణ, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణ కోసం యెస్ బ్యాంక్ చర్యలు చేపట్టిందని ఆంగ్ల మీడియాలో రిపోర్టులు వచ్చాయి. ఒక పక్క అనేక బ్యాంకులు కొత్త శాఖలను ఏర్పాటు చేస్తూ వేగంగా విస్తరిస్తుంటే యెస్ బ్యాంక్ మాత్రం ఉద్యోగుల తొలగింపులకు వెళ్లటంపై ఇటు కంపెనీ ఇన్వెస్టర్లు, వినియోగదారుల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది. శాఖల బ్యాంకింగ్ విభాగంలోని అనేక విభాగాల్లో తొలగింపులు జరిగాయని తెలిసింది. కాగా.. ఒక మల్టీనేషనల్ కన్సల్టింగ్ సంస్థ సిఫార్సుల మేరకు ఈ తొలగింపులు చేపట్టింది. దీంతో హెూల్‌సేల్, రిటైల్ బ్రాంచ్ బ్యాంకింగ్ సహా పలు విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడింది. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు, సిబ్బంది వినియోగాన్ని మెరుగుపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. తొలగింపునకు గురైన ఉద్యోగులకు మూడు నెలల జీతాన్ని బ్యాంక్ ఆఫర్ చేసిందని తెలుస్తోంది. యెస్ బ్యాంక్ ఎక్కువగా డిజిటల్ బ్యాంకింగ్ వైపు మొగ్గుచూపుతూ.. భౌతిక జోక్యాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో బ్యాంక్ సిబ్బంది ఖర్చులు 12 శాతం పెరగటం కూడా తాజా చర్యలకు దారి తీసిందని తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో యెస్ బ్యాంక్ నికర లాభాలు ఏకంగా 74.66 శాతం పెరిగి రూ.1285.20 కోట్లకు చేరడం విశేషం. 2022-23లో రూ.735.82 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే గతేడాదియ భారీగా లాభాలు పెరిగినప్పటికీ ఉద్యోగులకు ఉద్వాసన పలకడం గమనార్హం. బుధవారం బిఎస్ఇలో యెస్ బ్యాంక్ షేర్ 0.87శాతం తగ్గి రూ.23.81 వద్ద ముగిసింది. మార్కెట్ కాపిటలైజేషన్ రూ.74.640 కోట్లుగా నమోదయ్యింది.

# గోల్డ్ లవర్స్‌కి సూపర్ న్యూస్..



గోల్డ్ ప్రియులకు నిజంగానే ఇది గుడ్ న్యూస్.. బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత ఐదు రోజులుగా గోల్డ్ రేట్స్ సుమారు రూ. 1,250 మేరకు తగ్గాయి.విదేశాల్లో బంగారం నిల్వలు తగ్గడంతో.. దాని ప్రభావం దేశంలోని పసిడి ధరలపై పడిందని నిపుణులు అంటున్నారు. గురువారం(జూన్ 27) 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 260 మేరకు తగ్గి రూ. 65, 990గా ఉంది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 240 తగ్గి రూ. 71, 990 దగ్గర కొనసాగుతోంది. దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరల్లోనూ స్వల్పం తేడాలు కనిపిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 66,140గా ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,650 దగ్గర కొనసాగుతోంది. అలాగే ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 65,990గా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 71,990గా ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 65,990 వద్ద కొనసాగుతుండగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 71,990గా ఉంది. వెండి కూడా బంగారాన్ని అనుసరిస్తోంది. గడిచిన ఐదు రోజుల్లో ఏకంగా రూ. 4,100 మేరకు తగ్గింది. గతంలో రూ. లక్ష దాటిన వెండి ధర.. ఇప్పుడు నేల చూపులు చూస్తోంది. హైదరాబాద్, కేరళ, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో కిలో వెండి రూ. 94,400 వద్ద కొనసాగుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణే నగరాల్లో కిలో వెండి రూ. 89,900గా ఉంది.



# ఈ కారు కొనడానికి ఇక మార్కెట్లో ఉండదు..?




కొన్ని అద్భుతమైన కార్లు ఇప్పటికే కనిపించకుండా పోయాయి. అలాంటి కార్లు మరోసారి వస్తాయంటే కారు ప్రియుల్లో పండుగ వాతావరణం నెలకొన్నట్లవుతుంది. గతంలో ఉన్న అంబాసిడర్ కారు.. తిరిగి కొత్త రూపంలో వస్తుందన్న ప్రచార సాగడంతో ఆ కారు ప్రియులు ఎంతో సంతోషించారు. ఆ తరువాత చాలా కార్లు కొన్నాళ్లపాటు అలరించి ఆ తరువాత కనిపించకుండా పోయాయి. అయితే లేటేస్టుగా మరో సూపర్ కారు కూడా కనిపించకుండా పోనుంది. దీనిని కొనుగోలు చేద్దామన్నా మార్కెట్లో కనిపించదు. ఇంతకీ ఏ కారు ఏదంటే? దేశంలో కార్ల ఉత్పత్తిలో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటోంది హ్యుందాయ్ కంపెనీ. ఈ కంపెనీ నుంచి ఇప్పటికే చాలా ఆకర్షణీయమైన మోడళ్లు వచ్చాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ కంటే ఎలక్ట్రిక్ కార్ల హవా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అందరికంటే ముందుగా హ్యుందాయ్ 'కోనా' అనే ఎలక్ట్రిక్ కారు మార్కెట్లోకి వచ్చింది. ఇది మార్కెట్లోకి వచ్చిన మొదటి ఎలక్ట్రిక్ కారు. 2019లో రిలీజ్ అయిన ఈ కారు ఆ తరువాత ఐదేళ్ల పాటు తన హవా సాగించింది. అయితే ఈ కారు ఇప్పుడు కనుమరుగు కానుంది. అయితే ఈ కారు ఉత్పత్తి నిలిపివేసినా దీని స్థానంలో క్రెటా ఈవీని మార్కెట్లోకి తీసుకురానున్నారు. ఇది 2025 లో మార్కెట్లోకి రానుంది. అయితే ప్రస్తుతం కోనా కారు కొనుగోలు చేయాలని ఉత్సాహం ఉన్నవారు ఆ కారు గురించి తెలుసుకోవాల్సింది. కోనా ఫీచర్స్ విషయానికొస్తే ఈ మోడల్ 29.2 కిలో వాట్ బ్యాటరీ ప్యాక్ ను కలిగి ఉంది. సింగిల్ ఛార్జింగ్ తో 452 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఇందులో ఉన్న 100 కిలోవాట్ మోటారు 131 బీహెచ్ పీ పవర్ ను 395 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. కోనా కారు ధర మార్కెట్లో ప్రస్తుతం రూ.25.30 లక్షల తో విక్రయిస్తున్నారు. దీని స్థానంలో క్రెటా ఈవీ రానుంది. ప్రస్తుతం హ్యుందాయ్ క్రెటా కారు ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఎస్ యూవీలో ది బెస్ట్ కారుగా ఉన్న క్రెటా ఇప్పుడు ఈవీగా రాబోతుంది. పెట్రోల్, డీజిల్ కార్ల నుంచి ఈవీకి మారాలనుకునేవారు క్రెటా ఈవీ మంచి ఆప్షన్ అని కారు ప్రతినిధులు పేర్కొంటున్నారు. అయితే ఆ కారు ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలంటే 2025 వరకు ఆగాల్సిందే..

# పాలసీదారులు అప్రమత్తంగా ఉండాలి..

### హెచ్చరించిన ఎల్ఐసీ..




లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా కోట్లాది మంది పాలసీదారులను కలిగి ఉంది. అయితే దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసీ తన వినియోగదారులకు హెచ్చరిక జారీ చేసింది.తన పాలసీదారులకు వారి బీమా పాలసీలకు సంబంధించిన అనధికార లావాదేవీల గురించి అప్రమత్తం చేసింది. కొన్ని కంపెనీలు పాలసీని సరెండర్ చేసే పేరుతో ఎల్ఐసి పాలసీ హెూల్డర్ల నుండి పాలసీని పొందాలనుకుంటున్నట్లు నివేదికలు వెలువడిన తర్వాత ఈ హెచ్చరిక జారీ చేసింది. ప్రజలు తమ ప్రస్తుత ఎల్ఐసి బీమా పాలసీని మంచి మొత్తం చెల్లిస్తామని హామీ ఇవ్వడం ద్వారా వారిని ఆకర్షిస్తున్న ఇలాంటి అనేక నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అటువంటి పరిస్థితిలో ప్రజలు తమ బీమా పాలసీలను కంపెనీలకు సరెండర్ చేయడం లేదు. ఈ కంపెనీలను లేదా వాటి ఆఫర్లను ఎల్ఐసి ఆమోదించలేదని బీమా కంపెనీ తెలిపింది. అలాంటి ఆఫర్ల ఉచ్చులోకి అడుగు పెట్టకండి, లేకుంటే మీరు భారీ నష్టాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఎల్ఐసీ తెలిపింది. మా కంపెనీ నియమ నిబంధనల ప్రకారమే పాలసీలను అందిస్తున్నట్లు తెలిపింది. అయితే కొందరు తమ బీమా పాలసీలను కంపెనీలకు అప్పగించకుండా ఈ విధంగా విక్రయిస్తున్నారు. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని, లేకుంటే నష్టపోతారని ఎల్ఐసీ నేరుగా ప్రజలను కోరింది. ఇలాంటి అనేక దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రజలకు మంచి మొత్తం చెల్లిస్తామని హామీ ఇవ్వడం ద్వారా వారి ప్రస్తుత %బా×జ% బీమా పాలసీలను ఉపసంహరించుకోవలసి వస్తుందని తెలిపింది. ప్రజలు తమ బీమా పాలసీలను కంపెనీలకు సరెండర్ చేయకుండా, వాటిని ఈ విధంగా విక్రయిస్తున్నారు. ఇప్పుడు దీనిపై ఎల్ఐసీ స్పందించి పాలసీదారులను అప్రమత్తం చేసింది. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని ఎల్ఐసీ నేరుగా ప్రజలను కోరింది. పాలసీదారులు తమ బీమా పాలసీకి సంబంధించి ఏ నిర్ణయమైనా చాలా ఆలోచించి తీసుకోవాలని తెలిపింది. ఇది అతని కుటుంబానికి బీమా రక్షణ ప్రమాదాన్ని పెంచుతుంది. అదే సమయంలో వారి ఆర్థిక స్థిరత్వం కూడా ప్రభావితం కావచ్చు. ఎల్ఐసి తన పాలసీలలో ఏదైనా అమ్మకం లేదా బదిలీ బీమా చట్టం 1938 ప్రకారం జరుగుతుందని కూడా తన ప్రకటనలో పేర్కొంది. అందువల్ల, ఎవరైనా కస్టమర్‌లకు అలాంటి ప్రేరణలు కల్పిస్తే, దానికి ముందు వారు ఏదైనా ఎల్ఐసీ ఉద్యోగి లేదా ఏజెంట్ నుండి దాని గురించి ధృవీకరణ పొందాలని సూచించింది.

# న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి మేఘా ఇంజనీరింగ్

meil

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) న్యూక్లియర్ విద్యుత్ రంగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 1400 మెగావాట్ ఎలక్ట్రికల్ (ఎండబ్ల్యుఇ) అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ అఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్) నుంచి కాంట్రాక్టును దక్కించుకున్నట్లు బుధవారం ఆ సంస్థ వెల్లడించింది. ఎన్‌పిసిఐఎల్ పిలిచిన టెండర్లలో ఎంఇఐఎల్ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంది. ఇపిసి పద్ధతిలో దీన్ని నిర్మించనుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అణు ఇంధనశాఖ పరిధిలోని ఎన్‌పిసిఐఎల్ ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్చన్ (ఇపిసి) పద్ధతిలో ఈ రియాక్టర్ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్లు పిలిచింది.అదే ఏడాది అక్టోబర్ నాలుగున టెండర్ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. ఆ తరువాత రోజు అక్టోబర్ 5న సాంకేతిక బిడ్లను తెరిచారు. ఈ ఏడాది జూన్ 26న ప్రైస్ బిడ్లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువ ధరను కోట్ చేసి ఎంఇఐఎల్ తొలి స్థానంలో నిలిచినట్లు సంస్థ డైరెక్టర్ సి హెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్అండ్‌టి, బిహెచ్ఇఎల్ కూడా పాల్గన్నాయి. ఈ రెండు, సంస్థలు ఎక్కువ ధరను కోట్ చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఎంఇఐఎల్ రూ.12,799.92 కోట్ల ధరను కోట్ చేసి మొదటి స్థానంలో నిలిచింది. టెండర్ల విధానంలో ఎన్‌పిసిఐఎల్ క్వాలిటీ కం కాస్ట్ బేస్డ్ (క్యుసిబిఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సంస్థ పిలిచిన టెండర్లలో ఇదే పెద్దది. టెండర్ ఖరారుకు ముందు ఎన్‌పిసిఐఎల్ నాణ్యతా ప్రమాణాలు, ఖర్చు నియంత్రణ ఇతర అంశాలపై అంచనాలు వేసింది. రూ.13 వేల కోట్ల విలువ కలిగిన కాంట్రాక్టును ఎంఇఐఎల్ తొలిసారిగా దక్కించుకుని అణు ఇంధన రంగంలోకి ప్రవేశించిందని సుబ్బయ్య తెలిపారు. ఇది తమ సంస్థ ప్రయాణంలో ఒక మైలు రాయి అని ఆయన పేర్కొన్నారు.

# వాహనదారులకు గుడ్ న్యూస్..



దేశవ్యాప్తంగా రోడ్లు సరిగా లేని ప్రాంతాల్లో టోల్ ఛార్జీలు వసూలు చేయొద్దని ఆయా ఏజెన్సీలకు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. గుంతలతో కూడిన రోడ్లు, టోల్ ప్లాజాల వద్ద రద్దీ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుపై నిర్వహించిన గ్లోబల్ వర్క్‌షాప్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'మీ సేవలు ఉత్తమంగా లేనపుడు టోల్ ఛార్జీ వసూలు చేయొద్దు. రోడ్లు బాగా లేకపోతే ప్రజలు హర్షించరు. చాలామంది ఇప్పటికే సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాబట్టి మంచి రోడ్లు నిర్మించలేపుడు టోల్ వసూలు చేయడం సరైనది కాదు. ఒకవేళ గుంతలతో కూడిన రోడ్లపై టోల్ వసూలు చేస్తే రాజకీయ నాయకులుగా మేం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. నేషనల్ హైవే ఫీల్డ్ ఆఫీసర్ల టోల్ ప్లాజాల వద్ద ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి' అని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. శాటిలైట్ ఆధారిత టోల్ ఛార్జీల వసూలు విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించనున్నట్లు గడ్కరీ స్పష్టం చేశారు. తొలి దశలో 5 వేల కిలోమీటర్ల రహదారులపై ఈ టోల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని, మొదట కమర్షియల్ వాహనాలకు ఒక లేన్‌లో అనుమతిస్తారని పేర్కొన్నారు. టోల్ వసూలుకు కీలకమైన వెహికల్ ట్రాకర్ సిస్టమ్ యూనిట్‌ను ఆయా వాహనాల్లో అమర్చాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేదు. దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.10వేల కోట్లు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

# తొలిసారి ఫైనల్‌కు సౌత్ ఆఫ్రికా..




ఆఫ్ఘనిస్తాన్ మ్యాజిక్ చేయలేకపోయింది. సూపర్ -8 లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్ల పై ప్రదర్శించిన మాయాజాలాన్ని పునరావృతం చేయలేకపోయింది.. సంచలన ఆటతీరుతో ఆకట్టుకున్న కాబూలీలు.. సెమీస్ మ్యాచ్లో చేతులెత్తేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లకు దాసోహమయ్యారు. గుర్బాజ్(0), నూర్ అహ్మద్(0), నబీ(0) ఇలా ఏకంగా ముగ్గురు బ్యాటర్లు సున్నా పరుగులకే వెనుతిరిగారంటే.. దక్షిణాఫ్రికా బౌలింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇబ్రహీం జద్రాన్(2), ఖరోటే(2), కరీమ్ జనత్(8), రషీద్ ఖాన్ (8), గుల్బాదిన్(9), అజ్మతుల్లా (10) పూర్తిగా నిరాశపరచడంతో ఆఫ్ఘనిస్తాన్ 56 పరుగులకే కుప్ప కూలింది.. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్సన్, షమ్సీ తలా మూడు వికెట్లు దక్కించుకున్నారు. రబాడా, నోర్జే చెరో రెండు వికెట్లు పడగొట్టారు.. వాస్తవానికి ట్రినిడాడ్ మైదానం చాలా కఠినంగా ఉంటుంది. రాత్రిపూట మంచు కురవడం వల్ల బంతి స్వింగ్ అయ్యేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. అందుకే టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకుంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ మైదానంలో పరిస్థితిని అంచనా వేయకుండానే, టాస్ గెలిచి బ్యాటింగ్ వైపు మొగ్గు చూపాడు. అది ఎంత తప్పుడు నిర్ణయమో తర్వాత గాని అతనికి అర్థం కాలేదు.. ఆఫ్ఘాన్ తొలి ఓవర్ చివరి బంతికే గుర్బాజ్ (0) పరుగులకే జాన్సన్ బౌలింగ్లో అవుట్ అయ్యాడు. అప్పుడు ప్రారంభమైన వికెట్ల పతనం క్రమం తప్పకుండా కొనసాగింది.. ఒకానొక దశలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు స్కోర్ 20 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇబ్రహీం జద్రాన్, నబీ (మూడో ఓవర్ లో కేవలం మూడు బంతుల వ్యవధిలో) అవుట్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్ కనీసం 50 పరుగులైనా చేయగలుగుతుందా అనే అనుమానం అభిమానుల్లో వ్యక్తం అయింది. ఈ దశలో రషీద్ ఖాన్ కాసేపు ప్రతిఘటించినప్పటికీ.. ఉపయోగం లేకుండా పోయింది. ఇక 57 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో 60 పరుగులు చేసి, 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దక్షిణాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ అయిదు పరుగులకే ఫారూఖీ బౌలింగ్లో అవుట్ అయినప్పటికీ.. రీజా హెండ్రిక్స్(29), కెప్టెన్ మార్క్రం (23) ధాటిగా బ్యాటింగ్ చేయడంతో దక్షిణాఫ్రికా సులువుగా గెలిచేసింది. ఈ గెలుపు ద్వారా దక్షిణాఫ్రికా తొలిసారి టి20 వరల్డ్ కప్ లో ఫైనల్ చేరింది. 2014లో దక్షిణాఫ్రికా తొలిసారి టీ20 వరల్డ్ కప్ లో సెమీఫైనల్ చేరింది.. ఆ తర్వాత పదేళ్ల అనంతరం మళ్లీ ఇప్పుడు దక్షిణాఫ్రికా %%20 వరల్డ్ కప్ లో రాణించింది.. బౌలింగ్, ఫీల్డింగ్ లో ఆకట్టుకున్న దక్షిణాఫ్రికా.. ఆఫ్ఘనిస్తాన్ పై అన్ని విభాగాలలో పై చేయి సాధించింది.. టి20 క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా %-% ఆఫ్ఘనిస్తాన్ నాలుగుసార్లు తలపడ్డాయి. నాలుగుసార్లు కూడా దక్షిణాఫ్రికా గెలిచింది.. తాజాగా గురువారం జరిగిన టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్ మ్యాచ్లో ఆఫ్ఘనిస్తాన్- దక్షిణాఫ్రికా పరస్పరం తలపడగా.. ఈసారి కూడా దక్షిణాఫ్రికా గెలి చేసింది. మొత్తానికి గత ట్రాక్ రికార్డును కంటిన్యూ చేసింది.. ఇక ఈ ఓటమి ద్వారా ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాస్తవానికి ఆ దేశంలో క్రికెట్ ఆడేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ.. ఉన్న కొద్దిపాటి అవకాశాలను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కఠోర సాధన తో మైదానంలో చెమటోడ్చారు. క్రికెట్ ఆడొద్దన్న తాలిబన్లను ఒప్పించి మరీ.. తమ ప్రతిభను నిరూపించుకున్నారు. టి20 వరల్డ్ కప్ లో తొలిసారి సెమీఫైనల్ దాకా వచ్చారు. సూపర్ -8 లో బలమైన ఆస్ట్రేలియాను, లీగ్ దశలో న్యూజిలాండ్ జట్టును మట్టికరించారు. సెమీఫైనల్ మ్యాచ్లో మాత్రం తేలిపోయారు. దక్షిణాఫ్రికా ముందు తలవంచారు.

# పాక్ మాజీ కెప్టెన్ సంచలన ఆరోపణలు





టీమిండియాపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ సంచలన ఆరోపణలు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా బాల్ టాంపరింగ్‌కు పాల్పడిందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు.ఆస్ట్రేలియాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ అసాధారణమైన రివర్స్ స్వింగ్‌ను రాబట్టాడని ఇంజి ఆరోపించాడు. అర్ష్‌దీప్ తన సెకెండ్ స్పెల్‌లో (16వ ఓవర్‌లో) కొత్త బంతితో రివర్స్ స్వింగ్‌ను ఎలా రాబట్టగలిగాడని ప్రశ్నించాడు. సహజంగా బంతి పాతబడ్డాక రివర్స్ స్వింగ్ అవుతుంది. అలాంటి?ది అర్ష్‌దీప్ కొత్త బంతితో రివర్స్ స్వింగ్ ఎలా రాబట్టాడని నిలదీశాడు. బాల్ టాంపరింగ్‌కు పాల్పడకుండా ఆటగాళ్లపై కన్నేసి ఉంచాలని అంపైర్లకు సూచించాడు. పాకిస్తాన్‌కు చెందిన ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ఇంజమామ్ ఈ ఆరోపణలు చేశాడు. కాగా, ఆస్ట్రేలియాతో జరిగిన సూపర్-8 మ్యాచ?లో టీమిండియా 24 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేయగా.. ఛేదనలో తడబడిన ఆస్ట్రేలియా లక్ష్యానికి 25 పరుగుల దూరంలో (20 ఓవర్లలో 181/7) నిలిచిపోయింది. అర్ష్‌దీప్ సింగ్ (4-0-37-3), కుల్దీప్ యాదవ్ (4-0-24-2), బుమ్రా (4-0-2-9-1) ఆస్ట్రేలియాను దెబ్బకొట్టారు. ఇదిలా ఉంటే, నిన్నటి మ్యాచ్‌లో బంగ్లాపై ఆఫ్ఘనిస్తాన్ గెలుపుతో టీ20 వరల్డ్‌కప్ 2024లో నాలుగు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. గ్రూప్-1 నుంచి భారత్, ఆఫ్ఘనిస్తాన్.. గ్రూప్-2 నుంచి సౌతాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించాయి. జూన్ 27 ఉదయం జరిగే తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ తలపడనుండగా.. అదే రోజు రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో టీమిండియా, ఇంగ్లండ్ జట్లు ఢీకొంటాయి.

# గెలవాలంటే చెమటోడ్చాల్సిందే..!




టి20 ప్రపంచకప్-2024 ఓటమి ఎరుగని టీమిండియా రేపు డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో పోటీపడనుంది. లీగ్‌లో మూడు మ్యాచుల్లో, సూపర్8లో మరో మూడు మ్యాచుల్లో టీమిండియా సునాయాసంగా విజయాలను నమోదు చేసుకుంది.లీగ్‌లో పాకిస్తాన్‌పై మినహాఈ టోర్నమెంట్‌లో అప్రతిహాత విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియా.. అదే జోరును సెమీస్‌లోనూ చూపాల్సి ఉంది. భారత్-ఇంగ్లండ్ సెమీఫైనల్ మ్యాచ్‌కు వరుణ గండం పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మ్యాచ్ జరిగే సమయానికి 88 శాతం వర్షం పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలో నేటి మ్యాచ్ రద్దైతే పరిస్థితి ఏంటనే ప్రశ్న అభిమానుల్లో నెలకొలింది. షెడ్యూల్ ప్రకారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతే (ఒక్క బంతి కూడా పడకుండా) సూపర్-8 దశలో గ్రూప్ (గ్రూప్-1) టాపర్‌గా ఉన్న కారణంగా టీమిండియా ఫైనల్ చేరుతుంది. ఒకవేళ భారత్-ఇంగ్లండ్ సెమీస్ మ్యాచ్‌కు వర్షం కారణంగా పాక్షికంగా అంతరాయం కలిగితే.. ఫలితం తేలేందుకు 250 నిమిషాల అదనపు సమయం ఉంటుంది. ఇక్కడ కూడా ఫలితం తేలకపోతే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ధారిస్తారు.

# ఫుట్‌బాల్ చరిత్రలో తిరుగులేని నెదర్లాండ్స్‌ను ఓడించిన ఆస్ట్రియా



సరిగ్గా ముప్పై ఆరేళ్ళ క్రితం జూన్ 25న నెదర్లాండ్స్ ఫుట్ బాల్ జట్టు ఒక సంచలనం సృష్టించింది. యూరో ఛాంపియన్ షిప్ ఫైనల్స్ లో బలమైన సోవియట్ రష్యాపై 2-0 స్కోరుతో గెలిచింది. సరిగ్గా ఇప్పుడు అంటే 2024లో అటువంటి అద్భుతమే మరోటి జరిగింది. కానీ, ఈసారి ఒదిన జట్టు డచ్ జట్టు కావడం విశేషం. ఫుట్ బాల్ టీమ్స్ లో శక్తివంతమైన జట్టుగా పేరుపొందిన నెదర్లాండ్స్ ను చిన్న టీమ్ గా చెప్పుకునే ఆస్ట్రియా షాక్ కి గురిచేసింది. గతంలో ఈ రెండు టీమ్స్ మధ్య జరిగిన ఏడు మ్యాచ్ లలో నెదర్లాండ్స్ జట్టు గెలిచింది. ఒక్క 1990లో మాత్రమే ఆస్ట్రియా గెలిచింది. నెదర్లాండ్స్ మేనేజర్ రోనాల్డ్ కొమన్ తన టీమ్ ను ఎంత ప్రోత్సహించినా.. సెల్ఫ్ గోల్స్ రూపంలో వారిని పరాజయం వెంటాడింది. ఈ గేమ్ లో ఆస్ట్రియా కౌంటర్ విధానం చాలా బాగుంది. గేమ్ ప్రారంభమైన 23వ నిమిషంలో మాలెన్ ఒక గోల్ చేశాడు. తిజ్జని రీజండర్స్ ఇచ్చిన రివర్స్ పాస్ ని మాలెన్ సద్వినియోగం చేశాడు. ఈ సమయంలో నెదర్లాండ్స్ ప్రశాంతంగా ఆడి ఉన్నట్టయితే, గేమ్ డ్రా చేసుకోవడానికైనా అవకాశం ఉండేది. అయితే, అలా జరగలేదు. ఇక్కడ ఆస్ట్రియా గేమ్ ప్లాన్ బావుంది. నిజానికి ఆస్ట్రియా మొదటి 30 నిమిషాల వరకు డచ్ గోల్ పై ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. ఆ తరువాత ఆస్ట్రియా డచ్ పై గోల్స్ సాధించింది. మొత్తం మీద మూడు గోల్స్ చేసింది. తరువాత నెదర్లాండ్స్ కి అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. సెకండ్ హాఫ్ లో ఆస్ట్రియాకు వారి ఆధిక్యాన్ని నిలుపుకోవడం కొంచెం కష్టంగా మారింది. ఈ సమయంలో నెదర్లాండ్స్ ఈక్వలైజ్ చేసే అవకాశం దొరికింది. దీంతో ఆస్ట్రియా చిక్కుల్లో పడినట్టు అనిపించినా.. నెదర్లాండ్స్ ఆటను తన చేతిలోకి తీసుకునేలా కనిపించినా.. ఒక్కసారిగా ఆస్ట్రియా ఎదురుదాడికి దిగడంతో డచ్ జట్టుకు అవకాశం దొరకలేదు. దీంతో 3-1 స్కోరుతో ఆస్ట్రియా జట్టుపై నెదర్లాండ్స్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

# మీడియా పెళ్ళిళ్ళు



ఆ మధ్య ఓ ప్రముఖ క్రీడాకారుడు తన భార్య నుంచి కేసులు ఎదుర్కొన్నాడు. ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడు కోర్టు మెట్లు ఎక్కాడు. ఆ తర్వాత కోర్టు నుంచి ఊరట పొందాడు. ఇక మరో క్రీడాకారిణి క్రీడాకారుడైన తన భర్త నుంచి విడాకులు తీసుకుంది.. తన ఒక్కగానొక్క కొడుకుతో కలిసి జీవిస్తోంది. పైగా ఆమె తన అంతర్జాతీయ కెరియర్ కు వీడ్కోలు పలికింది. అయితే అ క్రీడాకారుడు, క్రీడాకారిణి.. ఏదో ఫంక్షన్ లో కలిశారు. కాసేపు కలివిడిగా మాట్లాడుకున్నారు. అంతే మీడియాలో ప్రముఖంగా ఫోటోలు ప్రచురితమయ్యాయి. వారిద్దరూ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారు అనే వార్తలు ప్రసారమయ్యాయి.. దీంతో షాక్ అవడం వారిద్దరి వంతయింది.. “మేము బురద చల్లుతాం.. కడుక్కోవడం మీ ఖర్మ” అనే రేంజ్ లో మీడియా వ్యవహరించడంతో.. చివరికి ఆ క్రీడాకారిణి తండ్రి స్పందించక తప్పలేదు. పైన చెప్పిన వృత్తాంతం మొత్తం టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా, టీమిండియా పేస్ బౌలర్ మహమ్మద్ షమీ మధ్య జరిగింది. “మా బతుకులేవో బతకనివ్వండి. ఇలా మాకు తెలియకుండానే మా పెళ్లి జరిపించకండి. కనీసం మా పెళ్ళికైనా మమ్మల్ని పిలవండి. పెళ్లి అనేది నలుగురి మధ్య జరుపుకునే వేడుక. అదేదో రహస్యంగా నిర్వహించుకునేది కాదని” సానియా మీర్జా,మహ్మద్ షమీ వేరువేరుగా తమ అంతరంగీకుల వద్ద వాపోయారంటే మీడియాలో వచ్చిన వార్తలు వారిని ఏ స్థాయిలో ఇబ్బందికి గురి చేశాయో అర్థం చేసుకోవచ్చు. సానియా మీర్జా, మహమ్మద్ షమీ పెళ్లి ఎపిసోడ్ ముగిసిన తర్వాత.. మీడియా మళ్లీ ఇప్పుడు శిఖర్ ధావన్, మిథాలీ రాజ్ చుట్టూ తిరుగుతోంది. తాజాగా ఇదే విషయాన్ని శిఖర్ ధావన్ పంచుకున్నాడు. జియో సినిమాలో ప్రసారమయ్యే “ధావన్ కరేంగే” అనే కార్యక్రమంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను చెప్పుకొచ్చాడు..” నాకు మీడియా పెళ్లి చేసింది. నేను భారత మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ ను పెళ్లి చేసుకోబోతున్నానని విన్నాను. ఆశ్చర్యమేంటంటే ఆ పెళ్లి నిశ్చయించిన విషయం కూడా నాకు తెలియదు. కనీసం మిథాలీ రాజ్ కైనా తెలుసో, లేదో” అని చమత్కరించాడు. మిథాలీ 2022 ప్రపంచ కప్ లో భాగంగా క్రైస్ట్ చర్చ్ వేదికగా దక్షిణాఫ్రికా తో తన చివరి మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పేసింది. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో గుజరాత్ మహిళా జట్టుకు మెంటార్ గా వ్యవహరిస్తోంది. ఇక శిఖర్ ధావన్ ఐపీఎల్ లో పంజాబ్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. భారత క్రికెట్ జట్టులోకి వచ్చిన తొలి నాళ్లల్లో అతడు ఆస్ట్రేలియాకు చెందిన ఆయేషాముఖర్జీ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. ఆయేషా కు అంతకు ముందే వివాహం జరిగింది. పిల్లలు కూడా ఉన్నారు. మొదటి భర్త ద్వారా విడాకులు తీసుకున్న తర్వాత ఆయేషా - శిఖర్ వివాహం చేసుకున్నారు. ఆయేషా - శిఖర్ దంపతులకు జోరావర్ అనే కుమారుడు ఉన్నాడు..2020 ఆగష్టు 8 నుంచి ఆయేషా - శిఖర్ విడివిడిగా ఉంటున్నారు. 2023 అక్టోబర్ నెలలో కోర్టు వారికి విడాకులు మంజూరు చేసింది. తన కొడుకును తన వద్దకు పంపించే ఏర్పాట్లు చేయాలని కోర్టుకు విన్నవించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మరో వైపు ఐపీఎల్ లోనూ శిఖర్ ధావన్ ప్రయాణం పడుతూ లేస్తూ సాగుతోంది. ఈ సీజన్ లో గాయాల కారణంగా శిఖర్ చాలా మ్యాచ్ లకు దూరంగా ఉన్నాడు.

# క్రికెట్‌లో “డక్ వర్త్” రూపకర్త ఇకలేరు..



క్రికెట్ లో అనూహ్యంగా వర్షం పడినప్పుడు.. వాతావరణం లో వేడి ఎక్కువున్నప్పుడు.. మైదానం తేమగా ఉన్నప్పుడు.. అభిమానులకు డక్ వర్త్ లూయిస్’ అనే పదం సుపరిచితమే. డక్ వర్త్ లూయిస్ విధానంలో ఓవర్లను తగ్గించారని, లక్ష్యాన్ని కుదించారని అభిమానులు వింటూనే ఉంటారు.. అయితే ఈ డక్ వర్త్ లూయిస్ స్టెర్న్ విధానాన్ని ఆవిష్కరించిన వారిలో ఒకరైన ఫ్రాంక్ డక్ వర్త్ ఇక లేరు. ఆయన ఈనెల 21న కన్నుమూశారు. వృద్ధాప్యం వల్ల ఏర్పడిన అనారోగ్యంతో ఆయన కాలం చేశారు. అయితే ఆయన మరణ వార్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డక్ వర్త్ కు 84 ఏళ్ళ వయసు. ఆయన మరణ వార్తను ఓ వెబ్ సైట్ ధ్రువీకరించింది. డక్ వర్త్ స్వస్థలం ఇంగ్లాండ్. ఆయన గణాంక శాఖలో నిపుణుడిగా పని చేసేవాడు.. ఆయనకు క్రికెట్ అంటే వల్ల మాలిన ఇష్టం ఉండేది. ఈ క్రమంలో టోనీ లూయిస్ అనే వ్యక్తితో కలిసి డిఎల్ఎస్ అనే పద్ధతిని రూపొందించాడు. అనుకోని పరిస్థితుల్లో వాతావరణం మారినప్పుడు, వర్షం కురిసినప్పుడు క్రికెట్ మ్యాచ్ లో ఫలితం రాబట్టేందుకు ఆయన ఒక కొత్త సమీకరణాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. డక్ వర్త్ డీఎల్ఎస్ ను ఆవిష్కరించనప్పుడు.. వర్షం కురిసి ఆటంకం కలిగితే మ్యాచ్ ను అంపైర్లు రద్దు చేసేవారు. కానీ డక్ వర్త్ లూయిస్ తీసుకొచ్చిన విధానం ద్వారా వర్షం కురిసినప్పటికీ విజేతను నిర్ణయించేందుకు అవకాశం కలిగింది. డక్ వర్త్ లూయిస్ విధానాన్ని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ 1997లో తొలిసారిగా అమలు చేసింది. అనంతరం వర్షం వల్ల మ్యాచ్ లకు ఆటంకం కలిగితే, లక్ష్యాలను నిర్ణయించేందుకు 2001 నుంచి ఈ పద్ధతిని ప్రామాణికంగా తీసుకోవడం మొదలుపెట్టింది. డక్ వర్త్ లూయిస్ పద్ధతికి తర్వాతి కాలంలో ఆస్ట్రేలియాకు చెందిన గణాంక నిపుణుడు స్టీవెన్ స్టెర్న్ అనేక మార్పులు తీసుకొచ్చాడు. ఆ తర్వాత ఈ పద్ధతికి డక్ వర్త్ లూయిస్ స్టెర్న్ ( డీఎల్ఎస్) గా పేరు పెట్టారు. కాగా లూయిస్ 2020లో అనారోగ్య కారణాల వల్ల కన్నుమూశారు. అయితే ఈ డీఎల్ఎస్ పద్ధతి కొన్ని జట్లకు వరంగా, మరికొన్ని జట్లకు శాపంగా మారిన సందర్భాలు అనేకం ఉన్నాయి.. వర్షాల వల్ల మ్యాచ్ కొనసాగించలేని పక్షంలో.. డీఎల్ఎస్ విధానాన్ని అమలు చేయడం వల్ల, అప్పటిదాకా విజయం దిశగా దూసుకెళ్లిన జట్లు ఎన్నోసార్లు ఓడిపోయాయి.

## కల్కి భారీ విజయంపై లోకేశ్ అభినందన

**దర్శకునికి నాని, మంచు మనోజ్‌ల కితాబు**

'కల్కి' సినిమా బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ భారీ బడ్జెట్ సినిమా హిట్ కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా మూవీ టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు. తాజాగా ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ 'కల్కి' టీమ్‌ను అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సినిమాకు వస్తోన్న అద్భుతమైన రివ్యూలు వినడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణెలకు అభినందనలు తెలిపారు. గొప్ప సినిమాను తెరకెక్కించారంటూ నాగ్ అశ్విన్‌కు ధన్యవాదాలు చెప్పారు. తెలుగు సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేశారంటూ నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి చిత్రం. పురాణాలకు సైన్స్‌ను ముడిపెట్టి తీసిన మాస్ ఇండియన్ ఫిల్మ్.. తెలుగు ల్యాండ్ నుంచి చూస్తారా? అయితే 'కల్కి 2898 ఏడీ'ని చూడండి. నాగ్ అశ్విన్, ప్రభాస్ అన్న, వైజయంతీ మూవీస్‌తో పాటు చిత్రబృందం అందరికీ శుభాకాంక్షలు. ఎంతో గర్వంగా ఉందని నటుడు నాని కితాబునిచ్చారు. నలుమూలల నుంచి బ్లాక్‌బస్టర్ టాక్ వినిపిస్తోంది. టీమ్‌కు శుభాకాంక్షలు. నాగ్ అశ్విన్ విజన్‌కు హ్యాట్సాఫ్. నిర్మాత దూరదృష్టి, అంకితభావం ఈ పురాణకథకు ప్రాణం పోశాయి. భారతీయ సినీ రంగంలో 'కల్కి' ఓ మైలురాయి అంటూ మంచు మనోజ్ అబినందించారు.

# ప్రసాద్ ఐ మాక్స్ వద్ద సందడి



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిన 'కల్కి 2898 ఏడీ' రిలీజ్ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ వద్ద సందడి నెలకొంది. సినిమా చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సినిమాలో ఉపయోగించిన 'బుజ్జి' (వాహనం)ని అక్కడ ప్రదర్శనకు ఉంచారు. దాని వద్ద ఫొటోలు తీసుకునేందుకు ఫ్యాన్స్ పోటీ పడ్డారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలి రావడంతో ఐమాక్స్ వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.




# విజయ్ సరసన జాన్వీకపూర్



**కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం**


అగ్రనటుడు విజయ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించనుందనే వార్త కోలీవుడ్‌లో హల్చల్ చేస్తుంది. ప్రస్తుతం విజయ్ 'ది గోట్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత హెచ్. వినోద్ దర్శకత్వంలో విజయ్ తన 69 వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవలకాలంలో జాన్వీ కపూర్ ఎక్కువగా ముంబై టు చెన్నై మధ్య చక్కర్లు కొడుతున్నారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని పుణ్యస్థలాలను సందర్శిస్తోంది. అయితే, తన తల్లి శ్రీదేవి నిలదొక్కుకున్న తమిళంలో తాను ఎంట్రీ ఇచ్చేందుకు ఆమె ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన కుమార్తె కోర్కెను తీర్చేందుకు ఆమె తండ్రి, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ ముందుకు వచ్చారు. విజయ్ 69వ చిత్రంలో కుమార్తెకు అవకాశం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. హెచ్. వినోద్ (ఊ ÷ఎతినినీట) దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'వలిమై', 'తుణివు' చిత్రాలను బోనీ కపూర్ నిర్మించారు. దీంతో దర్శకుడు హెచ్. వినోద్ - బోనీ కపూర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండటంతో విజయ్ చిత్రంలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని టాక్ వినిపిస్తుంది. మరో వైపు జాన్వీ కపూర్ ఇప్పటికే సౌత్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'దేవర సినిమాలోనూ.. అలాగే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఖీఅ16 చిత్రంలోనూ ఆమె అవకాశం సొంతం చేసుకుంది. 'దేవర' చిత్రం రెండు పార్ట్‌లుగా రానుంది కాబట్టి.. జాన్వీలో సౌత్‌లో మూడు సినిమాలు చేస్తున్నట్లుగా చెప్పకోవచ్చు. ఇప్పుడు విజయ్ సినిమాలో కూడా ఆమెకు అవకాశం వచ్చినట్లుగానే టాక్ వినబడుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## నిఖిల్ స్వయంభూలో కీలక సన్నివేశాల చిత్రీకరణ

నిఖిల్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'స్వయంభూ మారేడుమిల్లిలోని బ్యూటీఫుల్ లోకేషన్స్ లో కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. మారేడుమిల్లిలోని దట్టమైన అడవులలో నిఖిల్ పై కొన్ని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరిస్తున్నారు. నిఖిల్ హీరోగా 20వ చిత్రంగా పీరియాడికల్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ఆయన కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీగా ఉండేలా దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ ఈ 'స్వయంభూస చిత్రాన్ని అత్యున్నత ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ స్టాండర్డ్స్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నిఖిల్ లెజెండరీ వారియర్ పాత్రను పోషిస్తుండగా ఆ పాత్ర కోసం ఆయన ప్రత్యేక శిక్షణ కూడా తీసుకోవడం విశేషం. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం, కెకె సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాకరన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా చేస్తున్నారు.

# గేమ్ ఛేంజర్‌ను త్వరగా పూర్తి చేస్తా : శంకర్



రామ్‌చరణ్ - శంకర్‌ల కాంబోలో తెరకెక్కుతోన్న సినిమా 'గేమ్ ఛేంజర్' చిత్రం నుంచి అప్‌డేట్ వచ్చి చాలా రోజులవుతోంది. తాజాగా దర్శకుడు శంకర్ దీనిపై అప్‌డేట్ ఇచ్చారు. 'ఇండియన్ 2' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' గురించి మాట్లాడారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలిఉంది. 'ఇండియన్ 2' రిలీజ్ కాగానే 'గేమ్ ఛేంజర్' ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాను. అన్ని పనులు పూర్తయిన తర్వాత రిలీజ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటా. సాధ్యమైనంతవరకు త్వరగానే రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ చెప్పారు. అలాగే హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ.. శంకర్ ఓ సినిమాలో 2000 మందితో సన్నివేశాలు చిత్రీకరించారు. అవి అద్భుతంగా ఉన్నాయని అన్నారు. దీంతో సిద్దార్థ్ చెప్పింది 'గేమ్ ఛేంజర్' గురించేనని రామ్‌చరణ్ అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154

# పాఠశాలల్లో మౌలిక వసతులు ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారు





**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**
**వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్**

**వికారాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం) :**

పాఠశాలల్లో మౌలిక వసతులు సక్రమంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యా బోధనా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివారెడ్డి పెట్, యుపిఎస్ ఉర్దూ మీడియం స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యెన్నె పల్లి, అంగన్వాడి కేంద్రం -1 , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వికారాబాద్, ఎంపిపిఎస్ పాఠశాలలను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలు బాగుండి, మంచి విద్యా బోధనా ఉంటేనే పిల్లలు బాగా చదువులో రాణిస్తారని అన్నారు. అంగన్వాడి కేంద్రము, ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం నేర్పించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రము పిల్లలతో ఇంగ్లీష్ పోయమ్స్, ఎబిసిడిలు చదివించారు. పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. అన్ని స్కూల్స్ లో అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద చేపట్టిన పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద చేపట్టిన పనులకు ఇప్పటి వరకు వచ్చిన బడ్జెట్ లో చేసిన పనులను పరిశీలించారు. బడ్జెట్ ఎంత వచ్చింది, ఏమేమి పనులు చేశారు అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా పాఠశాల లో చేపట్టిన త్రాగునీరు, టాయిలెట్స్, మైనర్ మేజర్ రిపేర్లు, బాలికల కోసం టాయిలెట్స్, విద్యుద్దీకరణ పనులు ఇప్పటివరకు ఎన్ని పూర్తయినవి, ఇంకా ఎన్ని చేపట్టవలసి ఉన్నవి, ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి చేశారు , ఇంకా చేయాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**మరుగుదొడ్ల పనులను పరిశీలించిన కలెక్టర్..**

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అమ్మ ఆదర్శ పాఠశాలలో టాయిలెట్స్, మరుగుదొడ్లు వంటి పనులు ప్రభుత్వం మంజూరు చేయడంతో పనులు సక్రమంగా జరిగాయా లేదా అన్న విషయాలను కలెక్టర్ స్వయంగా పనులు పరిశీలించి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్వాణ సరిగ్గా ఉంటుందా లేదా అన్న విషయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. టాయిలెట్స్ లో మీరు వస్తుందా లేదా అన్న విషయాలను కూడా సమగ్రంగా పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులెన్ని, ఇంకా చేపట్టవలసిన పనులేవి అనే విషయాలను ప్రధానోపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల ఆవరణలో నిర్మాణమైన నాన్ హెూల్స్ నిర్వహణ తీరును కూడా కలెక్టర్ పరిశీలించడం గమనార్హం. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని క్లాసు రూమ్స్, వాటర్, కిచెన్ షెడ్ ,త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ, లైట్స్ తదితర పనులను పరిశీలించారు. మిషన్ భగీరథ వాటర్ సప్లయ్ పైపు లైన్లను పరిశీలించారు. ప్రతి ఒక్క స్కూల్ బిల్డింగ్ ల పై భాగంలో నీరు నిలువకుండ చర్యలు తీసుకోవాలని, ఇంకా చేపట్టవలసిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ తో పాటు మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎంఈఓ బాబు సింగ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, యునూష్, శ్రీశైలం, సంబంధిత అధికారులు ఉన్నారు.

# రక్తహీనతను సమూలంగా తగ్గించాలి





**వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్**

**వికారాబాద్, జూన్ 27 (ప్రజా స్వరం) :**

విద్యార్థులకు ప్రతి గురువారం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ ను వేసి, వారిలో ఉన్న రక్తహీనతను సమూలంగా తగ్గించే దిశగా ముందుకు వెళ్లాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ అన్నారు. గురు వారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు రిక్షా కాలనీలోని కేజీవీబీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ ను వేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ ను వేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేసిన సర్వేలో జిల్లాలో 75 శాతం మంది పిల్లలలో రక్తహీనత సమస్య ఉందని తెలిసింది. కాబట్టి పిల్లలకు ప్రతి గురువారం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ ను తప్పకుండా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ జివరాజ్, డిఐఒ బుచ్చిబాబు, మెడికల్ అధికారులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన, జీసీడి ఓ శ్రీదేవి, స్కూల్ ప్రిన్సిపల్ స్వరూప, విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# స్వర్ణగిరికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్, జూన్ 27 (ప్రజాస్వరం) :**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవలే ప్రారంభమైన స్వర్ణగిరి ఆలయానికి గత కొన్ని రోజులుగా భక్తులు పోటెత్తుతున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లే భక్తులంతా ఈ ఆలయాన్ని పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. ఇక వీకెండ్,సెలవు దినాల్లో అయితే విపరీతంగా రద్దీ ఉంటుంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ ఆలయానికి దర్శనానికి వస్తూ ఉండగా.....హైదరాబాద్ నగరం నుంచి ఎక్కువగా భక్తులు వెళుతున్నారు. ఈ నేపథ్యంలోనే భక్తులకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ గుడ్ న్యూస్ తెలిపింది. హైదరాబాద్ నుంచి స్వర్ణగిరి అలాయనికి ప్రత్యేక బస్సులు నడపాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. అయితే నేటి నుంచే ఈ ప్రత్యేక సర్వీస్ బస్సులు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి అని గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. జేబీఎస్ బస్ స్టేషన్ నుంచి రెండు ఈ - మెట్రో ఎక్స్ ప్రెస్ నాన్ ఏసి బస్సులను ఆలయానికి నడపనునట్టు అధికారులు తెలిపారు. ఈ బస్సులు ప్రతీ రోజూ ఉదయం 7,8 గంటలకు జేబీఎస్ బస్ స్టేషన్ నుంచి బయల్దేరి స్వర్ణగిరి ఆలయానికి చేరుకుంటాయి. ఇక మధ్యాహ్నం 2:50,3:50 గంటలకు తిరిగి ఆలయాం నుంచి హైదరాబాద్ బయలుదేరుతాయి. ఇక ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఆ ఆలయానికి ప్రతిరోజూ ఉదయం 7:30,8:30,10:30,11:35 గంటలకు అలాగే మధ్యాహ్నం 3:20 గంటలకు, సాయంత్రం 4:20,6:25,7:25 గంటలకు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి. స్వర్ణగిరి ఆలయం నుంచి జేబియస్ బస్ స్టేషన్ కు మధ్యాహ్నం 12:10,1:10 గంటలకు అలాగే రాత్రి 8,9 గంటలకు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఆలయం నుంచి తిరిగి ఉప్పల్ క్రాస్ రోడ్స్ సాయంత్రం 4:45,5:45 గంటలకు అందుబాటులో ఉండనున్నాయి. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే జేబీఎస్ నుంచి వెళ్లే బస్సులో ఒక్కొకరికి టికెట్ ధర రూ.100, ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి వెళ్లే బస్సులో రూ.80 గా అధికారులు నిర్ణయించారు.

# పెద్దేముల్ మండల సర్వసభ్య సమావేశం నేడు

**ఎంపీపీ అనురాధ రమేష్**



**తాండూరు, జూన్ 27 (ప్రజాస్వరం) :**

తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనురాధ రమేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ సునీత మహేందర్ రెడ్డి, స్థానిక బుయ్యని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస్ చారి, కో ఆప్షన్ సభ్యులు నసీర్, పెద్దేముల్ సొసైటీ చైర్మన్ ద్వావరి విష్ణువర్ధన్ రెడ్డి, తట్టేపల్లి సొసైటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, ఎంపిటిసిలు, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పార్క్ స్థలాన్ని కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

**కమిషినర్‌కు వినతి పత్రం అందచేసిన సత్య నగర్ కాలనీ వాసులు**



**మేడ్చల్, జూన్ 27 (ప్రజాస్వరం) :**

పట్టణ పరిధి సత్య నగర్ కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురైందని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి కాలనీవాసులు,సత్యానగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. 2000 గజాల తమ లేఅవుట్లో ఉన్న పార్కు స్థలాన్ని కొందరు రియాల్టర్లు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మేడ్చల్ పట్టణంలో పార్కు స్థలాలను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని కాలనీవాసులు సత్యా నగర్ కాలనీ ప్రెసిడెంట్ హరి సదరు రియల్టర్లను హెచ్చరించారు.. మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని పార్కు స్థలానికి సంబంధించిన సర్వే కూడా చేపడతామని చెప్పినట్లు కాలనీవాసులు తెలిపారు. మేడ్చల్ పట్టణంలో పార్కు స్థలాలను కబ్జా కాకుండా కాపాడుకుందాం అని కాలనీవాసులు నినాదాలు చేశారు.

# నీటి వనరుల వివరాలను జియో ట్యాగింగ్ చేయాలి

**హైదరాబాద్, జూన్ 27 (ప్రజా స్వరం) :**

కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్ గౌబా గురువారం జలశక్తి అభియాన్పై అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు, కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరుల వినియోగం కోసం శాస్త్రీయ ప్రణాళికలను రూపొందించాలని, వనరుల వివరాలను జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరుల వివరాలను కూడా సిద్ధం చేయాలని అన్నారు. ఉపాధి హామి పథకం, కాంపా, ఫైనాన్స్ కమిషన్ తదితర పథకాల కింద లభించే నిధులను నీటి సంరక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహెూత్సవంలో భాగంగా గతేడాది అమృత్ సరోవర్ కార్యక్రమం కింద 75 వేలకు పైగా కొత్త నీటి వనరులను నిర్మించినందుకు ప్రధాన కార్యదర్శులను ఆయన అభినందించారు. ఈ సంవత్సరం నారీ శక్తి సే జలశక్తి అభియాన్ ఇతివృత్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేసి నీటి నిర్వహణలో వారికి శిక్షణ ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాష్ట్రాలను కోరారు. నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవడంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు. గ్రామీణ, పట్టణ నీటి సరఫరా కోసం రాష్ట్రాలు సమగ్ర విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు. సరైన క్లోరినైజేషన్ చేసి నాణ్యమైన తాగునీటి సరఫరా జరిగెలా చూడాలని అన్నారు.

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

శుక్రవారం 28 జూన్ 2024

మెదక్
సంగారెడ్డి-సిద్దిపేట

www.prajaswaramdaily.com




## మంచినీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



**మంచిర్యాల, జూన్ 27(ప్రజాస్వరం):**

మంచిర్యాల మున్సిపాలిటీలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీకి మంచినీరు అందించే పంప్ హౌస్ వద్ద నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటిని మళ్లించే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించగా నేటి నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పనులను పర్యవేక్షించారు.

## కలెక్టర్‌ను కలిసిన లయన్స్ క్లబ్ సభ్యులు

**బెల్లంపల్లి, జూన్ 27(ప్రజాస్వరం):**

మంచిర్యాల జిల్లా నూతన కలెక్టర్ కుమార్ దీపక్ ను గురువారం లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ మైక్రో క్యాబినెట్ మెంబర్ ఫర్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ వి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జూలై 1న నిర్వహించే డాక్టర్స్ డే, ఇతర కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో.. వ్యక్తి దుర్మరణం

**చెన్నూరు, జూన్ 27(ప్రజాస్వరం):**

హాజీపూర్ మండలంలోని గుడిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంనూరుకు చెందిన దేవి సత్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందారు. వ్యవసాయం చేసే సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన కారుకూరి తిరుపతి అనే మిత్రుడితో కలిసి బైక్ పై ఇంటి నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లగా లారీ వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మరణించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## రైతులపై కేసులు పెట్టించడం సరికాదు

**సిర్పూర్, జూన్ 27(ప్రజాస్వరం):**

సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు రైతులపై కేసులు పెట్టించడం సరికాదు అని ఇప్పుడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ రావి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అందవెల్లి బ్రిడ్జ్ వద్ద పనులు జరుగుతుండగా వెళ్లి దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 100రోజుల్లో నియోజకవర్గానికి రూ. 100కోట్లు తెచ్చానని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**జగిత్యాల, జూన్ 27(ప్రజాస్వరం):**

బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రోజు జిల్లా కలెక్టర సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల 25 నిమిషాలు అయినప్పటికీ ఫార్మసిస్ట్, ఆయుష్ తప్ప మిగతా సిబ్బంది ఎవరు కూడా ఆసుపత్రిలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డిఎంహెచ్ఓ కి ఫోన్ చేసి దీనిపై ఆరా తీశారు. సమయపాలన పాటించపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్రీడా పాఠశాల ప్రవేశానికి ఎంపిక

**కోరుట్ల, జూన్ 27(ప్రజాస్వరం):**

సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికిగాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి ఎంపిక పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓ సురేందర్ తెలిపారు. ఎంపిక పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి 25 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు దివాకర్, రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి












**నూతన చట్టాలపై అవగాహన అవసరం**
**కొత్త చట్టాల పై ముగిసిన శిక్షణా తరగతులు**
**జిల్లా ఎస్పి బాలస్వామి**

**మెదక్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పి బాలస్వామి అన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం - 2023 పై జిల్లాలలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులు ఈ రోజుతో ముగిశాయి. జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అధ్వర్యంలో మెదక్ జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పి బాలస్వామి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం - 2023 చట్టాలు అమలులోకి వస్తున్నాయని అన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో, శిక్షలలో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు ఈ కొత్త చట్టాలు వీలుగా ఉంటాయన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులను నిర్వహించి, శిక్షణా తరగతుల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. శిక్షణ కాల సమయంలో సమయపాలన పాటిస్తూ అందరికీ అర్థమయ్యేలా తరగతులు బోధించిన డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ మధుసూధన్ గౌడ్, అల్లాదుర్గ్ సిఐ రేణుకా రెడ్డి , నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్, చేగుంట ఎస్ఐ బాలరాజు, సహాయ సిబ్బంది కానిస్టేబుల్స్ అనిల్ కుమార్, ఐటీ సెల్ సయీద్, ఐటీ సెల్ ను జిల్లా ఎస్పి బాలస్వామి అభినందించారు.

# విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెరగాలి





**మెరుగైన బోధన విధానాల ద్వారా ఉత్తమ ఫలితాలు**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, జూన్ 28 (ప్రజాస్వరం) :**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం చిలీప్ చెడ్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల అంగన్వాడి కేంద్రం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పిల్లలు చదువులో వెనుకబడినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తించారు. వెంటనే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ సబ్జెక్టుల వారీగా బోధన నైపుణ్యాలు మెరుగుపడాలని తద్వారా పిల్లలకు ఉత్తమ ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఒక నెల గడువు లోపు బోధనా విధానాల్లో మార్పు రావాలని మళ్లీ క్షేత్రస్థాయి పర్యటనలు విద్యార్థుల సామర్థ్యాల్లో వ్యత్యాసం కనపడకూడదని ఆదేశించారు. అనంతరం చిలిప్ చేడ్ గ్రామంలో పర్యటించి బడి బయట పిల్లలు ఎవరైనా ఉన్నారా అని స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ను పరిశీలించి చిన్నపిల్లలకు అందుతున్న పౌష్టికాహారం వివరాలను సంబంధిత అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మూడు సంవత్సరాలు నిండిన చిన్నపిల్లలను అంగన్వాడి సెంటర్లో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

